ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0

## పల్లె చూడని వెలుగు

» ఫ్రీ బస్సులకు ఆ..మహిళలు దూరం

■ లోపలి పేజీలో..



చాట్రాయి-జనార్దనవరం గ్రామాల మధ్య ఉధృతంగా ఉప్పువాగు



బండివారిగూడెం వద్ద ముగ్గురాలవాగు ఉధృతి

## పొంగిన వాగులు..నిలిచిన రాకపోకలు

టి.నర్సాపురం/చాట్రాయి, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగాయి. దీంతో అయా మార్గాల్లో గురువారం రాకపోకలు నిలిచిపోయాయి. టి.నరసాపురం మండలంలోని మక్కినవారిగూడెం- టి.నరసాపురం మార్గంలో దుర్గమ్మగుడి వద్ద జలవాగు, బండివారిగూడెం- మక్కినవారిగూడెం గ్రామాల మధ్య ముగ్గురాళ్లవాగు, అప్పలరాజుగూడెం- మధ్యాహ్నపు వారిగూడెం గ్రామాల మధ్య ఎర్రకాల్వ వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. చాట్రాయి మండలంలో ఉప్పువాగు, పెద్ద చెరువు వాగు ఉధృతంగా ప్రవహించడంతో చాట్రాయి-జనార్ధనవరం, చాట్రాయి-బూరుగుగూడెం, మర్లపాలెం-పోలవరం, కొత్తగూడెం-యర్రావారిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది వాగుల వద్ద బందోబస్తు నిర్వహించారు.



## పర్యాటకులతో పక్షుల కేంద్రం కళకళ

కైకలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):కొల్లేరు సరస్సు విదేశీ, స్వదేశీ పక్షులకు ఆల వాలం. సరస్సు పేరు చెబితేనే పర్యాటకులకు ఎంతో ఉత్సాహం కలుగుతుంది. అటపాక పక్షుల కేంద్రం చెరువులోనికి నీరు పెద్దఎత్తు చేరడంతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఐదు నెలలుగా నిలిచిన బోటు షికారును అటవీశాఖ అధికారులు మరలా పునరుద్ధరించడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. పక్షులను అతిసమీపం నుంచి చూస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోమటిలంక రహదారి వెంబడి వెళ్లి మరీ పర్యాటకులు కొల్లేరు సరస్సును తిలకిస్తున్నారు.

# వరి.. ఉరి!



## కైకలూరు నియోజకవర్గంలో తగ్గుతున్న సాగు విస్తీర్ణం

- లక్షా 24 వేల ఎకరాల నుంచి 30 వేలకు తగ్గిన వైనం
- ఇందుకు ముంపు సమస్యే ప్రధాన కారణం
- గిట్టుబాటు లేక చేపలు, రొయ్యల వైపే రైతుల మొగ్గు
- కూలీలకు.. రైస్ మిల్లింగ్‌కు పెద్ద దెబ్బ

ముదినేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):కైకలూరు నియోజకవర్గంలో వరి సాగు విస్తీర్ణం తగ్గుతోంది. చౌడు భూములతోపాటు వరి సాగుకు అనుకూలమైన నల్లరేగడి భూములు సైతం చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయి. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ప్రకృతి వైపరీత్యాలు, సాగునీరు, మురుగునీటి సమస్యలు వెంటాడుతున్న పరిస్థితుల్లో అన్ని తరగతుల రైతులు ఆక్వా వైపు మొగ్గు చూపుతుండటంతో వరి సాగుకు గడ్డుకాలం ఎదురైంది. మరోవైపు పలు ప్రాంతాల్లో అపరాల పంట కనుమరుగైంది. వ్యవసాయ అనుబంధ రంగాలు మూలనపడ్డాయి.

కృష్ణా తూర్పు డెల్టాలో ఒకప్పుడు ఆంధ్రా అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన కైకలూరు నియోజకవర్గంలో వరి సాగు విస్తీర్ణం 75 శాతం తగ్గింది. 1980కి ముందు నియోజకవర్గంలో లక్షా 24 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరిగేది. చేపలు, రొయ్యల చెరువుల తవ్వకాల వల్ల ఇప్పుడు ఆ విస్తీర్ణం ఇప్పుడు 30 వేలకు పడిపోయింది. అప్పట్లో సార్వా, దాళ్వా పంటల ద్వారా నియోజకవర్గంలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చేది. 20 ఏళ్లుగా వరి విస్తీర్ణం తగ్గటం, రెండో పంట లేకపోవటంతో ధాన్యం దిగుబడి నాలుగు లక్షల టన్నుల నుంచి 60 వేల టన్నులకు పడిపోయింది. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు సంభవించకుండా ఉంటేనే పైదిగుబడి వస్తుంది.

### ముంపు సమస్యే కారణం..

కృష్ణా తూర్పు డెల్టాకు శివారున వున్న కైకలూరు నియోజకవర్గంలో గతంలో పంట పొలాల ముంపు సమస్య ఎక్కువగా ఉండేది. ప్రధాన మురుగు కాల్వలైన పోల్‌రాజ్, పెదకొమ్మిలేరు, పెదలంక డ్రెయిన్ల అభివృద్ధికి నోచుకోకపోవటంతో అధిక వర్షాల వల్ల కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో తరచూ ముంపు సమస్య ఏర్పడి వరి పైరు దక్కేది కాదు. దీంతో పెద్ద రైతులు తమ భూములను చేపలు, రొయ్యల చెరువులుగా తవ్వి, ఆక్వా సాగు చేపట్టగా, చిన్న, మధ్య తరగతి రైతులు తమ పొలాలను చెరువుల తవ్వకాలకు లీజులకు ఇచ్చారు. దీంతో వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. చెరువులపై లీజులు ఆశాజనకంగా ఉండటంతో ఆక్వా రంగం అంతటా విస్తరించింది. ఇప్పుడు ఎకరానికి రూ.70 వేల నుంచి లక్ష వరకు ఏడాదికి లీజు ఇస్తుండటంతో నాణ్యమైన నల్లరేగడి భూములను రైతులు లీజుకు ఇచ్చేస్తున్నారు. ఇప్పటికే కైకలూరు, కలిదిండి మండలాల్లో 90 శాతం భూములు చెరువులుగా మారిపోగా, ముదినేపల్లి మండలంలో 75 శాతం, మండవల్లి మండలంలో 85 శాతం భూములు రొయ్యల చెరువులుగా మారిపోయాయి.

### • కష్టానికి తగిన ఫలితం లేదు



వరి సాగులో కష్టానికి తగిన ఫలితం రావడం లేదు. ఏటా సార్వా సీజను ప్రారంభంలోను, పంట చేతికి దక్కే సమయంలోను ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. రైతులకు పెట్టుబడి కూడా దక్కటం లేదు. అందుకే ఆదాయం కోసం భూములను చేపల చెరువులుగా మార్చేస్తున్నారు.

- నచ్చిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, ఉప్పరగూడెం

### • ముంపు ప్రధాన కారణం



ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న పొలాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. సాగు నీరందక, మురుగునీరు పోక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ వరి సాగు పట్ల విరక్తి చెందారు.

- సోమల మోహనరావు, రైతు, ముదినేపల్లి

### దెబ్బతిన్న మిల్లింగ్ పరిశ్రమ.. ఉపాధి కరువు

వరి సాగు తగ్గి ధాన్యం దిగుబడి పడిపోవడంతో నియోజకవర్గంలో రైసు మిల్లింగ్ పరిశ్రమ మూలన పడింది. 30 నుంచి 40 ట్రేడింగ్ రైస్ మిల్లులు ఉండగా, అన్నింటికీ ధాన్యం రవాణా జరిగేది. ఇప్పుడు ఆ మిల్లులు ప్రభుత్వం సేకరించే ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని సరఫరా చేసే పనులకే పరిమితమయ్యాయి. అలాగే వ్యవసాయ కూలీలకు పనులు కరువయ్యాయి. ఎక్కువ శాతం పొలాలు చేపల చెరువులుగా మారిన గ్రామాల్లో అక్కడ 90 శాతం మంది కూలీలకు పనుల్లేక పొట్ట చేతపట్టుకుని పనుల కోసం పట్టణాలకు తరలిపోతున్నారు.

## జిల్లా ఉద్యానవన శాఖాధికారిగా.. సాజా నాయక్

ఏలూరు,సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): జిల్లా ఉద్యానవనశాఖాధికారి (హార్టికల్చర్)గా కె.సాజా నాయక్ బదిలీపై నియమితులయ్యారు. ఈ పోస్టు కొద్దికాలంగా ఖాళీగా ఉంది. బదిలీపై వస్తున్న సాజా నాయక్ ఏపీ ఇరిగేషన్ లైవ్లీహుడ్ ఇంప్రూవ్‌మెంట్ (ఏపీఐ ఎల్‌పీ-2) కడాలో డిప్యూ టేషన్‌పై విజయవాడలో పనిచేస్తున్నారు. తిరిగి ఆయనను మాతృశాఖ అయిన ఉద్యానవన శాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఛీట్..ఫండ్

■ లోపలి పేజీలో..

» ఏలూరులో నమ్మించి రూ.5 కోట్లతో చిట్ ఫండ్ బోర్డు తిప్పేసిన దంపతులు..

# వెయ్యికి వందే..!

### మీకు అప్పు కావాలా ?

ఎంతైనా ఇవ్వడానికి ఆకివీడులోని కొందరు వడ్డీ వ్యాపారులు సిద్ధం. కాకపోతే మీకు కావాల్సిన మొత్తానికి ఏదైనా తనఖా పెట్టాలి. వడ్డీ మాత్రం మీ అవసరాన్ని బట్టి వెయ్యికి రోజుకు రూ.50 నుంచి వంద రూపాయల వరకు వుంటుందండోయ్..! ఇంకో విషయం ఈ వడ్డీ ప్రతి పదిహేను రోజులకు ఒకసారి చెల్లించాలి. లేకపోతే ఈ మొత్తం అసలులో కలిసిపోతుంది. అప్పుడు ఈ మొత్తానికి మళ్లీ వడ్డీ చెల్లించాలి. ఇలా రోజువారీ వడ్డీ వ్యాపారానికి అడ్డాగా మారింది ఆకివీడు పట్టణం. దీని వలలో చిక్కుకుని ఎందరో తమ అస్తులను పోగొట్టుకున్నారు.



## రోజు వారీ వడ్డీకి.. అడిగినంత అప్పు

- ఆకివీడులో చట్ట విరుద్ధంగా టెండరు వ్యాపారం
- నెల రోజులు కాకుండానే అసలును చేరుతున్న వడ్డీ
- ఓ వైపు చెడు వ్యసనాలు.. మరోవైపు అప్పుల ఊబిలో కూరుకుపోతున్న యువత

(ఆకివీడు-ఆంధ్రజ్యోతి):

చిరు వ్యాపారులు తమ రోజువారీ వ్యాపారానికి అప్పులు చేయడం సహజం. ఇలా అప్పులు చేసి సరుకులు కొనుగోలు చేసి వచ్చిన లాభాల నుంచి అప్పులు తీర్చేవారు. ఆ సమయంలో వడ్డీ నెలకు వందకు రూపాయిన్నర నుంచి రెండు రూపాయల వరకు నామమాత్రంగా వుండేది. రానురాను ప్రజల అవసరాలు పెరిగాయి. కొందరు యువత బెట్టింగులకు అలవాటుపడడంతో ఎంత వడ్డీ అయినా పర్వాలేదు. అప్పు దొరికితే చాలన్నట్టు పరిస్థితి మారింది. ఈ అవకాశాన్ని పలువురు వడ్డీ వ్యాపారులు దోపిడీలకు తెరలేపారు. యువత, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, ఒంటరి మహిళలు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారు. వేలల్లో అప్పులు ఇచ్చి లక్షల్లో తిరిగి వసూలు చేయడం మొదలైంది. ఇలాంటి సంఘటనలు చాలానే జరిగాయి. క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాట, కోడి పందేలకు అలవాటుపడిన యువత తమ వద్ద వున్న టీవీలు, గ్యాస్ సిలిండర్లు, సెల్‌ఫోన్లు, మోటారుసైకిళ్లు, కార్లు వంటి వస్తువులతోపాటు పొలాల డాక్యుమెంట్లు తాకట్టు పెట్టి అప్పు తీసుకుంటున్నారు. పందెంలో గెలిచి ఆ వచ్చిన సొమ్ములతో అప్పు తీర్చేయవచ్చని భావించి.. రెంటికీ చెడిపోతున్నారు.

### బైక్ తాకట్టు పెట్టి..

ఓ టెండర్, వడ్డీ వ్యాపారి వద్ద చెడు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు తల్లిదండ్రులకు తెలియకుండా రోజువారీ వడ్డీకి మోటారు సైకిల్ తాకట్టు పెట్టి వేలల్లో అప్పు తీసుకున్నాడు. మోటారు సైకిల్ ఏదని తల్లిదండ్రులు కొడుకును ప్రశ్నిస్తే.. ఫ్రెండ్‌కు ఇచ్చానని చెప్పాడు. వారమైనా బైక్ రాకపోవడంతో గట్టిగా నిలదీస్తే తాకట్టు పెట్టిన విషయాన్ని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. కొడుకును ఏమీ అనలేక.. అంటే ఏదైనా అఘాయిత్యం చేసుకుంటాడే మోననే భయంతో గుట్టుచప్పుడు కాకుండా తల్లిదండ్రులు వెళ్లి అసలు, వడ్డీ చెల్లించి మోటారు సైకిల్ తెచ్చుకున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం. ఓ వ్యాపారి ఒకరు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి వడ్డీ వ్యాపారం చేస్తూ ఆరు నెలల కాలంలోనే ఆ మొత్తాన్ని రెట్టింపు చేశాడు.

### నెలకు రూ.100 కోట్ల వ్యాపారం

ఆకివీడులో నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు రోజువారీ వడ్డీ వ్యాపారం జరుగుతుందని స్థానికుల అంచనా. వడ్డీలు చెల్లించడంలో ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా వీరి వేధింపులు మామూలుగా వుండవు. ఎదురు తిరిగినా, ప్రశ్నించినా రౌడీయిజం చేస్తారు. కోర్టు నోటీసులంటూ భయపెడతారు. ఇలా చట్టవిరుద్ధంగా అధిక వడ్డీలు వసూలుచేస్తూ పేదల బతుకులను చిదిమేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.



సామాన్లను తిరిగి గ్రామాలకు చేర్చుకుంటున్న ముంపువాసులు

## తిరిగొస్తున్నారు..

» వరద ముంపు తగ్గడంతో గ్రామాలకు బాధితులు

వేలేరుపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):గోదావరి వరదల కారణంగా వరద గ్రామాలను చుట్టుముట్టడంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లిన ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుతానికి వరదభయం తప్పిపోవడంతో తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. జూలై 11వ తేదీ నుంచి రెండు నెలల పాటు గోదావరి వరద మండలంలోని పలు గ్రామాలను చుట్టుముట్టింది. ఈ వరదనీరు గ్రామాల్లోకి వరద ప్రవేశించనప్పటికి బయటకు వచ్చేందుకు వీలు లేకుడా రహదారులు నీటమునిగాయి. దీంతో గ్రామాలు కూడా నీట మునుగుతాయన్న భయంతో (మిగతా 8వ పేజీలో)

# ఆటోవాలాలకు.. అండగా!



- రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం
- ప్రభుత్వ ప్రకటనతో ఆటో డ్రైవర్ల హర్షం
- జిల్లాలో ఆటోల సంఖ్య.. 5,450
- ఉపాధి పొందుతున్న కార్మికులు ఐదు వేలకు పైబడి..

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో వాలాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. దసరా రోజున ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించింది. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతున్నందున వీరిని ఆర్థికంగా ఆదుకోనున్నట్టు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఆటోవాలాలకు ఆర్థిక సాయం పథకం దసరాకు ప్రారంభించనున్నట్టు అనంతపురం సభలో బుధవారం అధికారికంగా సీఎం చంద్రబాబు ప్రకటించడంతో ఆటో కార్మికుల్లో హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి. జిల్లాలో సుమారు 5,450 ఆటోలు న్నాయి. ఐదువేల మందికి పైబడి ఉపాధి పొందుతున్నారు. పథకం అమలు, నమోదు ప్రక్రియపై రెండు రోజుల్లో ప్రభుత్వం విధి విధానాలు విడుదల చేయనుంది.

### ఆటో కార్మికులకు ఆర్థిక భరోసా



ఆటో కార్మికులకు రూ.15 వేల సాయం ఆటో కార్మికుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లుకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేల సాయాన్ని అందించారు. అయితే నిబంధనల పేరిట లబ్ధిదారులను సంఖ్య బాగా తగ్గించేశారు. రకరకాల ఫైన్లు విధించి ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో లాగేసుకునేది.

- ఎస్. లీలాకృష్ణ, ఏలూరు టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

### ఎంతో సంతోషంగా ఉంది..



సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఏడాదికి రూ.15 వేలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. పెనాల్టీల జీవో 21 రద్దు, సాధికారిత బోర్డు ఏర్పాటు, ఇంధన ధరలు తగ్గింపు వంటి ఎన్నికల హామీలు అమలు చేస్తే మేలు కలుగుతుంది.

- గాంధీరాజు, ఆటో డ్రైవర్, ఏలూరు

## పాత పెన్షన్ పునరుద్ధరించాలి

» డీఎస్సీ-2003 టీచర్ల నిరసన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ప్రకారం డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలని అభ్యర్థిస్తూ గురువారం సాయంత్రం సీపీఎస్ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి ఏలూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా నాయకులు శంకర్‌రావు, గణేష్, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ఉత్తర్వులపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి రాష్ట్రంలోని 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, పోలీసులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ విధానం 2004 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రాగా అంతకుముందే నోటిఫికేషన్లు విడుదలై, నియామకాలు తర్వాత జరిగిన కారణంగా సుమారు 11వేల మంది పాతపెన్షన్ నష్టపోయారని వివరించారు. వీరందరికీ పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని కేంద్రప్రభుత్వం మెమో 57 ఉత్తర్వుల ద్వారా ఐదేళ్ల క్రితమే రాష్ట్రప్రభుత్వానికి సూచించినా ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. దేశంలో 16 రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాయన్నారు. ఇదే మెమో ప్రకారం రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులకు గత ప్రభుత్వం పాత పెన్షన్‌ను ఇచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

## ఎనిమిది సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎనిమిది సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ స్పెషల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 158 సంఘాలకు ప్రస్తుతం ప్రకటించిన ఎనిమిదింటితో కలిపి ఇప్పటి వరకు 117 కమిటీలను ప్రకటించారు. ఇంకా 41 కమిటీలను నియమించాలి.

| సొసైటీ పేరు | త్రిసభ్య కమిటీ చైర్మన్ | సభ్యులు |
|---|---|---|
| జి.గణపవరం | జి.సూర్యచంద్రరావు | కణితి జయమ్మ, చెన్నుదుర్గారావు |
| తిరుమలాపురం | బి.రామచంద్రప్రసాద్ | ఆది లక్ష్మణస్వామి, ఆడమిల్లి రవి |
| ములగలంపల్లి | గంగిరెడ్డి రాఘవయ్య | పిన్నమనేని శ్రీను, అక్కిరెడ్డి ప్రభాకర్‌రావు |
| సరిపల్లి | యండ్రపాటి కృష్ణమూర్తి | మన్యం సత్తిపండు, వంకా వెంకటేశ్వరరావు |
| పోతునూరు | సీతల శ్రీరామన్నారాయణ గాంధీ | రాగం రాము, కంభంపాటి వెంకటేశ్వరారవు |
| కనసానిపల్లి | బాయన శేషగిరిరావు | ముల్లంగి వెంకటరత్నం, కుప్పాల జామయ్య |
| బూరుగుగూడెం | వెల్లంకి రాంబాబు | కలసాని సూర్యనారాయణ,తెళ్లూరి శేఖర్ |
| జీలుగమిల్లి | ఎస్‌వీఎల్ సత్యనారాయణరాజు | వి.అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు |

# పల్లె చూడని వెలుగు

ఆంధ్రజ్యోతి పరిశీలన



## మూడొంతుల గ్రామాలకు లేవు

చింతలపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం తెలంగాణ సరిహద్దులో ఉంది. జనాభా తక్కువ ఉన్న రోజుల్లోనే ఆర్టీసీ సర్వీసులు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం జనాభా పెరిగినా మూడొంతుల గ్రామాలకు బస్సులే లేవు. గతంలో నడిపిన సర్వీసులు చాలా రద్దు చేశారు. సర్వీసులు లేని గ్రామాల నుండి మండలానికి రావాలంటే ఆటో లేదా కాలిబాటన రావాల్సిందే. ఏలూరు-శివపురం, ఏలూరు-బాలువారిగూడెం, ఏలూరు-శెట్టివారిగూడెం, ఏలూరు-మల్లేశ్వరం, ఏలూరు-కాంతం పాలెం ఇంకా అనేక సర్వీసులు రద్దయ్యాయి. చింతలపూడిలో ఆర్టీసి డిపో పెట్టాలని 50 సంవత్సరాలుగా డిమాండ్ ఉంది. మూడుసార్లు అవకాశం వచ్చినా అప్పటి ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారు. రాష్ట్ర విభజన తరువాత ఈ పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయి. మండలంలో నడిచే సర్వీసుల్లో సగ భాగం తెలంగాణ సర్వీసులు ఉన్నాయి. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో ఉచిత ప్రయాణం ఇచ్చినా మండలంలో మూడొంతులు గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. ఉన్న వాటిలో సగం తెలంగాణ బస్సుల వల్ల మహిళలకు ప్రయోజనం లేదు. ఆంధ్ర సర్వీసులు సత్తుపల్లి వరకు అంతర్ రాష్ట్ర సర్వీసుల పేరుతో ఆ బస్సుల్లో కూడా ఉచితం లేదు. దీనివల్ల ఈ పథకంలో మండలం లోని మహిళలకు ఎటువంటి ప్రయోజనంలేదని నిట్టూరుస్తున్నారు. ఇక్కడ భౌగోళిక పరిస్థితులు ఆర్టీసి డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి, ఆర్టీసీ చైర్మన్, రవాణ శాఖా మంత్రికి విజ్ఞాపనలు కూడా ఇచ్చారు.

### 15 ఏళ్లుగా మా గ్రామానికి బస్సులు లేవు



మా ఊరు నామవరం. ఈ మార్గంలో సుమారు 20 గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. అంతకు ముందు ఇదే మార్గంలో ఎనిమిది సర్వీసులు నడిచేవి. రోడ్లు బాగోలేదనే నెపంతో బస్సులు రద్దు చేశారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినా ఉపయోగం లేకుండా పోయింది.

**- అశోక్‌కుమార్, నామవరం**



మర్రిగూడెంకు బస్సు సౌకర్యం లేక నడిచి వెళ్తున్న బాలికలు

### 15 ఏళ్ల కిత్రం నిలిపేశారు

**టి.నర్సాపురం :** టి.నర్సాపురం మండలంలోని 15 పంచాయతీలకు 15 ఏళ్ల క్రితం వరకు జంగారెడ్డిగూడెం డిపో ఏలూరు, తెలంగాణలోని సత్తుపల్లి, భద్రాచలం డిపోలకు చెందిన బస్సులు వచ్చేవి. మండలంలోని పలు గ్రామాలకు చేరే రహదారులు ఛిద్రం కావడంతో ఆ డిపోల బస్సుల రాకపోకలు నిలిపివేశాయి. జంగారెడ్డిగూడెం డిపో నుంచి మల్లుకుంట, వల్లంపట్ల, సింగరాయపాలెం, బొర్రంపాలెం, వీరభద్రవరం, వెలగపాడు గ్రామాలకు అలాగే లక్ష్మీపురం నుంచి అప్పలరాజు గూడెం, బండి వారిగూడెం, మక్కినవారిగూడెం, లంకాలపల్లి, మర్రిగూడెంలకు సర్వీసు నడిపేవారు. ఈ సర్వీసు 15 ఏళ్ల క్రితం నిలిపివేశారు. ఏలూరు డిపో నుంచి మల్లుకుంట, బొర్రంపాలెం, వెంకటాపురం, తిరుమలదేవిపేట, గండిగూడెం, టీ.నర్సాపురం మీదుగా బస్సు సర్వీసు నడిపేవారు. ఈ సర్వీసులు కూడా కొన్ని సంవత్సరాల క్రితం నిలిపివేశారు. మారుమూల ఉన్న మర్రిగూడెం, గట్టుగూడెం, బచ్చులేటివారిగూడెం, సున్నపురాళ్లపల్లి వంటి గిరిజన గ్రామాలకు నేటికి ఎటువంటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థినిలు నానా అగచాట్లు పడుతున్నారు.

### గతంలో సుఖంగా ప్రయాణించేవాళ్లం



గతంలో మా గ్రామానికి బస్సు సర్వీసు ఉండేది. ప్రయాణికులతో పాటు విద్యార్థుల కూడా సుఖంగా జంగారెడ్డిగూడెం చేరుకునేవారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి నుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చూసేందుకు సౌకర్యవంతంగా ఉండేది. బస్సు సర్వీసు పునరుద్ధరించాలి.

**-కుంజా వీరాస్వామి, మర్రిగూడెం గ్రామస్థుడు**

### ఆరేళ్లుగా అవస్థలు



**లింగపాలెం :** మా గ్రామాలకు ఆరు సంవత్సరాలుగా బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే బస్సు సౌకర్యం కల్పించా లని టీసీహెచ్ ఆర్‌పాలెం, కొణిజర్ల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి మండల కేంద్రమైన లింగపాలెం, ధర్మాజీగూడెంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్లు బాగా లేవని, ఆ రూట్‌లో ఎక్కువమంది ఎక్కడం లేదంటూ సర్వీస్ నిలిపి వేసినట్లు అధికారులు చెపుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఉచితం ఉన్నా ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదని టీసీహెచ్‌ఆర్ పాలేనికి చెందిన లక్ష్మీప్రసన్న ఆవేదన వ్యక్తం చేసింది.

### పాత సర్వీసులు పక్కన పెట్టారు

**జీలుగుమిల్లి :** గిరిజన గ్రామాలకు బస్సులు రాక పదేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గత ఐదేళ్ల క్రితం అంకన్నగూడెం, కామయ్యపాలెం గిరిజన గ్రామాల్ని కలు పుతూ మండల కేంద్రం జీలుగుమిల్లి మీదుగా జంగారెడ్డి గూడెం డీపోకు చెందిన అంకన్నగడెం సర్వీసు తిప్పేవారు. దీంతోపాటు జంగారెడ్డిగూడెం నుంచి వయా జొన్నవారిగూడెం మంగి శెట్టిగూడెం, ములగలంపల్లి, స్వర్ణవారిగూడెం, రౌతుగూడెం గ్రామాల మీదుగా పి.అంకంపాలెం, కామయ్యపాలెం నుంచి జీలుగుమిల్లి బస్సు సౌకర్యం ఉండేది. దాదాపు పదేళ్లుగా ఇసర్వీసు నిలిపివేశారు. మరోవైపు జంగారెడ్డిగూడెం నుంచి దర్బగూడెం వయా పండువారిగూడెం, దాట్లవారిగూడెం, వంకవారిగూడెం, బర్రింకలపాడు మీదుగా అశ్వారావుపేట సర్వీసు కనుమరుగైంది. అంకన్నగూడెం సర్వీసు ఏర్పాటు చేస్తే జీలుగుమిల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులకు ఉపమోగం ఉంటుందని తల్లిదండ్రులు, అధ్యాపకులు సైతం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించారు.

**గ్రామాలకు వెళ్లని పల్లె వెలుగు బస్సులు**
**రోడ్లు బాగోలేదని, నష్టాలు వస్తున్నాయంటూ సర్వీసులు నిలిపివేత**
**ఏళ్లు గడుస్తున్నా తప్పని అవస్థలు**
**ఫ్రీ బస్సులకు ఆ..మహిళలు దూరం**

**గ్రామాల్లో పల్లె వెలుగులు కనిపించడం లేదు. గతంలో ఆర్‌టీసీ బస్సులు పల్లెలకు వెళ్తుంటే సందడిగా వుండేది. ఆటోలు వచ్చిన తరువాత ఆర్టీసీ గ్రామాల్లోకి రావడం లేదు. రోడ్లు బాగోలేదనో, నష్టాలు వస్తున్నాయనో చాలా సర్వీసులను ఆర్టీసీ నిలిపివేసింది.. ఏళ్ల తరబడి ఆయా గ్రామాల వారు మొరపెట్టుకుంటున్నా ఫలితం ఉండడం లేదు.. ఉచిత బస్సు మాట ఎలా ఉన్నా తమకు అసలు బస్సే లేదంటూ కస్సుమంటున్నారు..**

### ఇరవై ఏళ్లుగా ఆ.. ఆరు గ్రామాల్లో చీకట్లే

**జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం మండలంలోని అనేక గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు తిరిగి ఏళ్ల గడుస్తున్నాయి. మండలంలోని నాగులగూడెం గ్రామానికి దాదాపు నలభై ఏళ్ళుగా ఆర్టీసీ బస్సు లేదు. మండలంలోని చక్రదేవరపల్లి, అక్కంపేట, చిన్నవారి గూడెం, ఏ.పోలవరం, తిరుమ లాపురం, కేతవరం గ్రామాలవైపు ఆర్టీసీ బస్సులు ఇరవై ఏళ్లపై నుంచే తిరగడం లేదు. గతంలో రోడ్లు బాగోలేదని, రూట్లు కలవడం లేదని,నష్టం వస్తుందని ఇలా ఎన్నో ఆటంకాలు చెప్పి బస్సులు తిప్పడం మానేశారు. తమ గ్రామాలకు బస్సులు తిప్పాలని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేసినా, ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చినా పాలకులు పట్టించుకోలేదు. ఆటోలపై ఆధారపడిపోయారు

### మూడు గ్రామాలకు ఆర్టీసీ దూరం

**తణుకు రూరల్ :** తణుకు మండలంలోని కొమరవరం, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, యర్రనీలి గుంట గ్రామా లకు ఆర్టీసీ బస్ సౌకర్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ గ్రామాలు ఆర్టీసీ బస్‌లు నడిచే ప్రధాన రూట్లకు దూరంగా వుండటంతో ఈ గ్రామాలకు మొదటి నుంచి ఆర్టీసీ బస్ సౌకర్యం లేదు. వీరు ఆర్టీసీ బస్‌లు ఎక్కాలంటే తణుకు భీమవరం రూట్ లోని వేల్పూరు, కానీ, ఇరగవరం కానీ వెళ్లి ఆర్టీసీ బస్‌లలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, నిడదవోలు, తణుకు, నిడదవోలు, రాజమండ్రి వంటి ప్రాంతాలకు ప్రయాణించాలి. అదే విధంగా తణుకు మండలంలోని ముద్దాపురం, కోనాల గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నారు.

### మా గ్రామాలకు బస్సు కావాలి

**పెనుగొండ :** మండలంలోని పలు గ్రామాలకు బస్సులు తిరగకపోవడంతో ప్రజలు ఇటు పెనుగొండ, అటు ఆచంట, మరో వైపు సిద్ధాంతం వెళ్ళి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి. మండలంలోని దేవ, కొఠాలపర్రు, సోమరాజుచెరువు గ్రామాలు మీదుగా గతంలో బస్సులు తిరిగేవి. తర్వాత ఆపేశారు. ఈ గ్రామాల ప్రజలు ఏదైనా ఊరు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.



గతంలో బస్సు తిరిగిన పెనుగొండ-దేవ రహదారి

## ఉండి మండలంలో సగం గ్రామాల్లో ఇక్కట్లు

**ఉండి :** ఉండి మండలంలోని 19 గ్రామాలకు ఉండి, కలిసిపూడి, చెరుకువాడ, పాములపర్రు, కోలమూరు, ఆరేడు, యండగండి, ఎన్‌ఆర్‌పీ అగ్రహారం గ్రామాలకు మాత్రమే ఆర్టీసీ బస్సులు వెళ్తున్నాయి. పదేళ్ల క్రితం చెరుకువాడ నుంచి అర్తమూరు వరకు ఆర్టీసీ బస్సు వెళ్లేది. ఇప్పుడు వెళ్లడం లేదు. ఆరేడు నుంచి కలిగొట్ల గ్రామానికి, ఆరేడు నుంచి పాందువ్వ మీదుగా ఉణుదుర్రు గ్రామాలకు బస్సు ఏర్పాటు చేయాలి. భీమవరం నుంచి మహదేవపట్నం సత్రం, చిలుకూరు, వెలివర్రు, ఉండి మీదుగా గతంలో ఆర్టీసీ బస్సు వుండేది. దానిని పునరుద్ధరించాలి. ఉండి నుంచి పెదపుల్లేరు మీదుగా చినపుల్లేరు వయా సీసలి, కోపల్లె గ్రామాలకు, ఉండి నుంచి వాండ్రం, కోపల్లె మీదుగా భీమవరానికి ఆర్టీసీ బస్సులను తిరిగి ప్రారంభించాలి.

### పాందువ్వ గ్రామానికి వేయాలి



పాందువ్వకు బస్సు నడపాలి. ఆరేడు నుంచి పాందువ్వ, ఉణుదుర్రు, యండగండి వరకు వెళ్లి అక్కడ నుంచి భీమవరం లేక తాడేపల్లిగుడెం వెళ్లేలా బస్సు వేయాలి. గ్రామానికి రోడ్డు సౌకర్యం వుంది.

**ముదుండి సురేంద్రవర్మ (ఎంఎస్) (పాందువ్వ)**

### మహదేవపట్నం-చిలుకూరు బస్సు పునరుద్ధరించండి



మహదేవపట్నం-చిలుకూరులకు బస్సు పునరుద్ధరిస్తే ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో భీమవరం నుంచి మహదేవపట్నం, చిలుకూరు, వెలివర్రు, ఉండి మీదుగా భీమవరం వెళ్లేది. ఆ సర్వీసులను కొనసాగిస్తే బావుంటుంది.

**సుబ్బలక్ష్మీ, సర్పంచ్, మహదేవపట్నం**

### బస్సు చూడని శేషమ్మ చెరువు

**ఆచంట :** ఆచంట మండలంలో శేషమ్మచెరువు గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామం ఆచంట, పెనుగొండ,పెనుమంట్ర మండలాలకు సంబంధించి మధ్యలో ఉంటుంది. ఈ గ్రామానికి బస్సు సర్వీసు ఉంటే ఇబ్బందులు తీరుతాయంటున్న గ్రామస్థుల కోరిక దీర్ఘకాలంగా మిగిలిపోయింది. ఆచంటకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో శేషమ్మచెరువు ఉంది. ఈ గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే ఆటోలపై ఆధారపడాల్సి ఉంది.

### మండల కేంద్రానికే లేదు

**యలమంచిలి:** మండల కేంద్రమైన యలమంచిలి నుంచి పాలకొల్లు వెళ్లే ప్రధాన మార్గమైన యలమంచిలి-మేడపాడు మీదుగా పాలకొల్లు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం ఒక బస్సు పాలకొల్లు, మేడపాడు, యలమంచిలి, ఊటాడ, కాజ, కొంతేరు మీదుగా పాలకొల్లు చేరుకుంటుంది. ఇదే బస్సు వస్తుంది. మండల కేంద్రమైన యలమంచిలి గ్రామస్తులు ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు వెళ్లాలంటే సొంత వాహనం లేదా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దశాబ్ద కాలానికి పైబడి ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని నేరేడుమిల్లి, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## మన్యం బిడ్డలు ఆగ్రహం

**బుట్టాయగూడెం :** ఏజెన్సీ గ్రామాలకు బస్సులను నిలుపుదల చేయడం పట్ల ఏజెన్సీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో మండలంలోని అనేక ప్రాంతాలకు జంగారెడ్డిగూడెం డిపో బస్సులు నడిచేవి. దట్టమైన అటవీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు సైతం వచ్చేవి. జంగారెడ్డిగూడెం నుంచి ఉదయం సాయంత్రం రెండు ట్రిప్పులు అటవీ ప్రాంతంలోని చింతపల్లి వరకు బస్సు నడిచేవి. జంగారెడ్డిగూడెం-పులిరాముడుగూడెం వయా రెడ్డికోపల్లె, జంగారెడ్డిగూడెం-కామవరం వయా గుబ్బల మంగమ్మతల్లి ఆలయం, జంగారెడ్డిగూడెం-కోయ రాజమండ్రి మీదుగా నిమ్మల గూడెం, దొరమామిడి మీదుగా అలివేరు తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేది. తర్వాత కాలంలో అన్ని రూట్లలో నిలిపివేశారు. పునరుద్దరించాలని అనేకమార్లు గ్రామస్తులు ఆందోళనలు చేశారు. అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఏమి చేసినా బస్సులు మాత్రం పునర్ధరించలేదు. అదేమని అడిగితే రోడ్లు బాగోలేదని, ఆదాయం రావడం లేదని చెప్పి తప్పంచుకునేవారిని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలుపుదల చేసిన రూట్లలో బస్సులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## ఆటో ప్రయాణంతో జేబులకు చిల్లు



**గణపవరం :** గణపవరం మండలంలో ఆర్‌టీసీ బస్సులు తిరగని గ్రామాలు పదికి పైనే ఉన్నాయి. పల్లెప్రజలకు ఉచిత ప్రయాణం అందని ద్రాక్షే అవుతోంది. ఉచిత బస్సుల్లో ప్రయా ణించాలంటే బస్సులు తిరగని గ్రామాల నుంచి గణపవరం మండల కేంద్రానికి చేరుకోవాలి. మండలంలోని విరేశ్వరపురం, వాకపల్లి వల్లూరు, కొత్తపల్లి, ఎస్.కొందేపాడు తదితర గ్రామాలకు అలాగే గణపవరం నుంచి అడవికొలను, చానమిల్లి గ్రామాలకు కొన్ని సంవత్సరాల నుంచి ఆర్‌టీసీ బస్సు సర్వీసులు నిలిపివేశారు. తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పల్లె వెలుగులు రావు ..ఆటోలు తిరగవు



గతంలో తాడేపల్లిగూడెం, వాకపల్లి, వీరేశ్వరపురం, వల్లూరు, సరిపల్లె కొత్తపల్లి మీదుగా ఆర్‌టీసీ సర్వీసులు ఉండేవి. వాటిని రద్దు చేశారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీసం ఆటోలు కూడా లేవు. నరకయాతన అనుభవిస్తున్నాం. ఉచిత బస్సు సర్వీసులు కావాలంటే గణపవరం పట్టణం వెళ్లాల్సిందే. రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలి.

**- కూనసాగి నాగేశ్వరరావు, కొత్తపల్లి**

### విద్యార్థులు, ప్రజలు అవస్థలు



తణుకు నుంచి ఎస్.కొందేపాడు మీదుగా భీమవరం సర్వీసు లను రద్దు చేశారు. దీంతో మా గ్రామానికి బస్సు లేక విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైద్య కోసం భీమవరం, తాడే పల్లిగూడెం, తణుకు వెళ్లాలన్న బస్సులు నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాలు గైదేళ్లుగా బస్సు సర్వీసులు రద్దు చేశారు. ఆటోలపైనే ఆధార పడుతున్నారు.

**- సీతాళం పుల్లయ్యనాయుడు, ఎస్.కొండేపాడు**

---



# సర్కారు బడిలో ఐఐటీ కోర్సులు

- **మద్రాస్ ఐఐటీతో ప్రభుత్వం ఒప్పందం**
- **6 నుంచి పదో తరగతి విద్యార్థులకు బోధన**

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సర్కారు బడులు బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల వరకూ ఎన్నో సంస్కరణలు చేపట్టింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకూ ఆసక్తిగల విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు అందించడానికి కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు మద్రాస్ ఐఐటీతో ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ అందించేందుకు నారాయణ విద్యా సంస్థలతో ఒప్పందం చేసుకోగా తరువాత వైసీపీ సర్కార్ ఆ ఒప్పందాన్ని నీరుగార్చింది. తాజాగా మద్రాసు ఐఐటితో ఫౌండేషన్ కోర్స్ అందించేందుకు సిద్ధమైంది. విద్యార్థులు,తలిదండ్రులు ఉన్నత, ఉత్తమ చదువులు అభ్యసించాలని, తగిన బోధన కావాలని కోరుకుం టారు. వారి అంచనా మేరకు నైపుణ్యం గల మద్రాసు ఐఐటీతో ఆన్‌లైన్ ద్వారా ఫౌండేషన్ కోర్సు అందించనున్నారు.

### ఉపాధ్యాయుల అనాసక్తి

విద్యా ప్రమాణాలు, విద్యార్థుల నైపుణ్యం పెంపొందించే దిశగా ప్రభు త్వం చర్యలు చేపడుతుంటే ఉపాధ్యాయుల నుంచి ఆశించిన సహకారం లేదు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ కోర్సు చెప్పించేందుకు ఉపాధ్యాయులు అనాసక్తితో ఉన్నారని తెలుస్తోంది. ఫౌం డేషన్ కోర్సుకు తప్పనిసరి కాకపోవడంతో ఉపాధ్యాయులు ఎవరూ ముందు కు రావడం లేదనేది విమర్శలు వినిపిస్తున్నాయి. మద్రాస్ ఐఐటీతో ఒప్పం దం కుదిరిందని, కోర్సు అందించాలని విద్యాశాఖ అధికారులకు సమాచారం ఉన్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

### అన్ని పాఠశాలల్లో ఈ కోర్సు ఉండాలి

అన్ని పాఠశాలల్లో ఐఐటీ ఫౌండేషన్ కోర్సు నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులంతా ఈ కోర్సు నేర్చుకోవాలనే కచ్చితమైన నిబంధన లేదు. ఆసక్తి ఉన్న విద్యార్థుల వివరాలు, టీచర్ల వివరాలు సేకరిస్తున్నాం. పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.


**- నారాయణ, డీఈవో, పశ్చిమ గోదావరి**

---

# ఎలుక @ రూ.100

### రైతులకు అదనపు భారం

### పంటను కొరికేస్తున్న మూషికాలు



రావిపాడులో చేలో సంచులు ఏర్పాటు చేసిన రైతులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు మండలంలోని ఓ గ్రామంలో కౌలు రైతు ఎలుకల బెడద ఎక్కువగా ఉందని ఎలుకలు పట్టేవారిని ఆశ్రయిస్తే ఎలుకకు రూ.100 ఖర్చవుతుందని చెప్పారు. సమస్య పరి ష్కారమవుతుందని సరే అన్నాడు. రెండె కరాల్లో 50 ఎలుకల వరకూ పడ్డాయి. ఎలుకకు రూ.100 చొప్పున లెక్కేస్తే రూ.5 వేలు ఖర్చయింది. దీంతో మూడు దఫాలుగా ఎలుకలు పట్టే వ్యక్తికి చెల్లించాడు.

తాడేపల్లిగూడెం మండలంలోని ఓ గ్రామంలో ఓ రైతు పదెకరాలు సాగు చేస్తున్నాడు. అయితే సాగు చేస్తున్న చేలో ఎలకలు నివారించేందుకు బుట్టలు పెట్టించాడు. ఎలుకలు పడలేదు. ఇలా నాలుగు సార్లు పెట్టించినా రెండు మాత్రమే పడ్డాయి. పట్టుకు రూ.600 చొప్పున బుట్టలు పెట్టిన వాడికి ముట్టచెప్పినా రూ.2400 ఖర్చయింది. మూషికాలు పంటనంతా కొరుక్కుతింటు న్నాయి. పంట నష్టం తప్పడం లేదు. ఎలుకల నియం త్రణ రైతులకు పెనుభారంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మునక భారిన పడి తేలిన పంట చేలలో ఎలుకల విజృంభన ఎక్కువగా ఉంటోంది. దీంతో ఒక పక్క కలుపు మరోపక్క ఎలుకలు రైతులను ఊపి రాడకుండా చేస్తున్నాయి. వేలకు వేలు ఖర్చు అవుతున్నా ఫలితం దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### నేడు సామూహిక ఎలుకల నివారణ

**జేడీఏ వెంకటేశ్వరరావు**

మెట్ట ప్రాంతంలో వరికోతల దశకు చేరుకోవడంతో డెల్టా ప్రాంతంలో ప్రస్తుతం ఎలుకల సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై అన్ని గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాం.అన్ని గ్రామాల వ్యవసాయశాఖ సిబ్బంది దీనిపై ప్రచారం చేసి రైతులకు ఉచితంగా మందులు అందించే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

---





పెదఅమిరంలో ఆక్వా ఎక్స్‌పో ఇండియా ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు.. ప్రాడక్ట్ ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

## ఆక్వా ఎక్స్‌పోలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కాళ్ళ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగులో మెలకువలతో రైతులు లాభసాటిగా ముందుకు సాగాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కాళ్ళ మండలం పెద అమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులపాటు జరిగే ఆక్వా ఎక్స్‌పో ఇండియాను గురువారం వారు ప్రారంభించారు. ఆక్వా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సహకారం అంది స్తున్నాయని, ఆక్వా రైతులను ఆదుకుంటామన్నారు. ఇటువంటి ఆక్వా ఎక్స్‌పోలను రొయ్య, చేపల రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మూడు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. నిర్వాహకులు దంతులూరి వేణు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా అనేక చోట్ల ఆక్వా ఎక్స్‌పో నిర్వహి స్తున్నామన్నారు. వంద స్టాల్స్‌తో ప్రదర్శన జరుగుతుందని, ఆక్వా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆక్వా రైతులు పాల్గొన్నారు.

---

# ఫ్యాన్ కింద పొత్తు..!

## విసిరే పనిలేదు..చేతికి తప్పిన శ్రమ



ఏలూరు నగరంలో రోడ్డు పక్కన జొన్నపొత్తుల దుకాణం నిర్వహించే మహిళ గులివెందుల రమణమ్మ బతుకుదెరువు కోసం తానే అవకాశం సృష్టించుకుంది. పొడుగు చేతుల చొక్కా.. కళ్లకు అద్దాలు.. కాళ్లపై నిప్పులు పడకుండా ఒక క్లాత్.. ఎదురుగా మొక్కజొన్న పొత్తులు కాల్చే నిప్పుల కుంపటి.. పాదచారులు, వాహనదారులను సైతం ఇట్టే ఆకట్టుకుంటుంది. అంతేనా వేడివేడిగా మొక్కజొన్న పొత్తులు ఇవ్వడానికి కూడా ఆమె దగ్గర మంచి చిట్కా ఉంది. నిప్పులపై పొత్తులు కాల్చడానికి చేతులు నొప్పి పుట్టేలా విసిరే అవసరం లేకుండా చిన్న చార్జింగ్ ఫ్యాన్ తెచ్చుకుంది. చార్జింగ్ ఫ్యాన్‌తో బొగ్గులపై పొత్తులు కాల్చి క్షణాల్లో వినియోగదారులకు పొత్తులు అందిస్తోంది. చార్జింగ్ ఫ్యాన్‌తో జొన్నపొత్తుల వ్యాపారం సునాయాసంగా నిర్వహించడం చూసే వారికి ముచ్చట గొలుపుతోంది. అన్నట్లు ఆమెకు ఉక్కగా ఉంటే కొద్ది నిమిషాలు ఆ చిన్ని ఫ్యాన్‌తోనే చల్లబడుతుంది.. ఆ ఫ్యాన్ నిప్పుల కుంపటిని రాజేస్తుంది.. ఉక్కబోత నుంచి ఉపశమనం ఇస్తుంది. బాగుంది కదా ట్రిక్. ఆమెను పలకరిస్తే చేతులు నొప్పి పుట్టేలా విసనకర్రతో బొగ్గులు.. పొత్తులు కాల్చడం పాత పద్ధతి. సులభంగా క్షణాల్లో పొత్తులు వేడి వేడిగా అందించడం కొత్త పద్ధతి అంటూ సరదాగా చెబుతుంది.

**- ఏలూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)**

---

### ధాన్యం సేకరణపై నేడు కాకినాడలో

# మంత్రి నాదెండ్ల సమీక్ష

### ఐదు జిల్లాల అధికారులతో ప్రత్యేక సమావేశం

కాకినాడ,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యా చరణ ప్రణాళికపై సమీక్షించేందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం కాకినాడకు విచ్చేస్తున్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.15 గంటలకు సమావేశం ఆరంభమవుతుంది. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జేసీలు, సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొంటారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐదు జిల్లాల పరిధిలో ఏ మేరకు వరిపంటను సాగు చేశారు..? ఏఏ రకాల వరివిత్తనాలు నాటారు?. ఎంతమేరకు ఉత్పత్తి వస్తోంది..? వంటి అంచనాలపై చర్చిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో మిల్లర్లు రైతులకు అందించాల్సిన సహకారంపై సూచనలు ఇస్తారు. ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై ఐదు జిల్లాల అధికారులు మంత్రి ముందు ప్రజంటేషన్ ఇస్తారు.



గవరవరం జడ్పీ హైస్కూలులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలో పాల్గొన్న టీచర్లు

## డిమాండ్ల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరసన వారం ప్రారంభం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై చొరవ తీసుకోవ పోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏపీటీఎఫ్ పిలుపు మేరకు ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన వారం తొలిరోజు గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా విజయవంతమైందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర తెలిపారు. అన్ని పాఠశాలల్లో టీచర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామసమయంలో నినాదాలు చేశారని వివరించారు. పెండింగ్‌లో వున్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వ మెమో 57ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, నివేదిక ఇచ్చేలోగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి వున్న అన్ని ఆర్థిక బకాయిల చెల్లింపునకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్యబీమా పథకం (ఈహెచ్‌ఎస్) పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, టీచర్లకు యాప్‌లను, అసెస్మెంట్లకు బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరసన వారంలో భాగంగా ఈనెల 12న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 13,14 తేదీల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు, 15న తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 16న జిల్లా కేంద్రంలో నిరసన, 17న సీఎం, సీఎస్‌లకు ఈ-మెయిల్స్, వాట్సప్‌ల ద్వారా సందేశాలు పంపడం కార్యక్రమాలను చేపడతామన్నారు.

## ఇంటర్ ఉత్తీర్ణులకు హెచ్‌సీఎల్‌లో ఉద్యోగావకాశాలకు ఎంపిక పరీక్ష నేడే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ 2004, 2005 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శుక్రవారం ఉదయం 9 గంటలకు ఏలూరు ఎన్‌ఆర్ పేట గ్రాండ్ ఆర్య రోడ్డులోని ఎన్నారై డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం, ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులతో ఎంపీసీ, ఎంఈసీ, ఒకేషనల్ గ్రూపుల విద్యార్థులు, 60 శాతం మార్కులతో మ్యాథ్స్ నాన్ మ్యాథ్స్ గ్రూపుల విద్యార్థులందరూ పాల్గొనేందుకు అర్హులేనని ఇంటర్మీడియట్ విద్యామండలి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు. పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రతినిధి సాయి కిరణ్‌ను 96429 73350 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## 14 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపిక పోటీలు

తణుకు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో జరిగే అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పోటీలో పాల్గొనే జిల్లా బాలురు, బాలికలు జట్లు ఎంపిక ఈనెల 14న ఆదివారం తాడేపల్లిగూడెంలోని వాసవీ ఇంజనీరింగ్ కాలేజిలో జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వైశ్రీకాంత్ గురువారం ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1 2006 తర్వాత జన్మించిన వారు అయ్యి ఉండాలని చెప్పారు. 75 కేజీలు లోపు బాలురు, బాలికలు 65 కేజీలు లోపు బరువు కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24వరకు విజయవాడలో జరిగే అంతర్ జిల్లాల జూనియర్ కబడ్డీ పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 9491333906, 9642496117 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## 26 నుంచి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

## 18న అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11, (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కంబైన్డ్ వెస్ట్ గోదావరి) ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన భీమవరం డీఎన్నార్ కళాశాల ప్రాంగణంలో అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు ఎస్కే షాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 18 ఉదయం 9 గంటలకు వైట్ యూనిఫాం, బూట్లు ధరించి సొంత కిట్‌తో హాజరు కావాలని సూచించారు. క్రీడాకారులు ఒరిజినల్ జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఒరిజనల్ స్టడీ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సెక్రటరీ ఏపీ స్టేట్ అల్లైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ డిప్లొమో ఇన్ పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సావిత్రి గురువారం తెలిపారు.ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు (ఆఫీసు పని దినాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు) ఏలూరు వైద్య కళాశాలలో రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు స్వయంగా ఏలూరు వైద్య కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారన్నారు.

## జిల్లా మీదుగా.. రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఈనెల 13వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ రెండు ప్రత్యేక రైళ్ళను చర్లపల్లి నుంచి అనకాపల్లి నడుపుతున్నట్లు విజయవాడ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైల్ నెంబర్ 07035 చర్లపల్లి నుంచి అనకాపల్లికి (ప్రతి శనివారం) ఈ నెల 13వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకూ నడపనున్నారు. రైల్ నెంబర్ 07036 అనకాపల్లి నుంచి చర్లపల్లికి (ప్రతి ఆదివారం) ఈనెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నడుపుతున్నట్లు ప్రకటించారు.ఈ ప్రత్యేక రైళ్ళు జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయన్నపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యల మంచిలి స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ఈ రైళ్ళల్లో ఫస్ట్‌క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రిటైర్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని తెలిపారు.



# నకిలీ నోట్ల నాటకం




వాళ్లను నకిలీ నోట్ల ముఠా అంటారు. కానీ వారి వద్ద నకిలీ నోట్లు ఉండవు.. వాళ్ల మాటలు నకిలీ.. చేతలు మోసం..! అసలు నోట్లు ఇస్తే రెండు మూడు రెట్లు నకిలీ నోట్లు ఇస్తామని, మార్కెట్‌లో సునాయాసంగా మార్పిడి చేసుకోవచ్చని నమ్మబలుకుతారు. ఎక్కడికి రావాలో వారే చెబుతారు. అసలు నోట్లు తీసుకున్న వెంటనే ముఠా ఏర్పాటుచేసిన వారే పోలీస్ సైరన్లతో వచ్చి మొత్తంగా పారిపోతారు. వారిచ్చినవి నకిలీ నోట్లు కాదు. పైన కింద అసలు నోట్లు మధ్యలో అన్నీ తెల్ల కాగితాలు. నకిలీ నోట్లతో లాభపడవచ్చని నమ్మిన అమాయకులు మోసపోయామని గొల్లుమంటారు.

- ఉమ్మడి జిల్లాలో నకిలీ ముఠాలు
- పోలీసులకు పట్టుబడినా మళ్లీ దందా
- అమాయకులే లక్ష్యంగా మోసాలు
- తొలుత అసలు నోట్లతో ఆశ చూపుతారు
- నోట్లు లేకుండానే టోకరా

ఏలూరు క్రైం / జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కొందరు ముఠాలుగా ఏర్పడి దొంగ నోట్ల పేరుతో అమాయకులను మోసగి స్తున్నారు. పోలీసులు దాడులు చేసి అరెస్టు చేసినా కొత్త ముఠాలు పుట్టుకొస్తున్నాయి. 20 ఏళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో భీమవరానికి చెందిన కట్టా బాబన్న గ్యాంగ్ డబ్లింగ్ కరెన్సీ చలామణికి పాల్పడేది. నలుపు రంగు పేపర్లను వారిచ్చే రసాయనాల్లో ముంచి ఆరబెడితే అసలు నోట్లుగా మారతాయని నమ్మించేవారు. పైన కింద రెండు రెండు అసలు నోట్లు ఉంచి మధ్యలో మారని నోట్లను పెడుతూ ఉంటారు. అన్ని నోట్లు నలుపురంగులోనే ఉంటాయి. పైన కింద ఉన్న నోట్లు రసాయనాల్లో ముంచితే అసలు నోట్లుగా వచ్చేస్తాయి. వీటిని శాంపిల్‌గా చూపించి ఎదుటి వ్యక్తులకు ఆశ కల్పించి అసలు కరెన్సీ నగదుకు మూడు రెట్లు ఇస్తామ ని నమ్మబలికి ఎక్కడో నిర్మానుష్య ప్రదేశంలో నగదు మార్పిడి చేసుకోవడానికి ప్రణాళిక చేస్తారు. వారిలో కొంతమంది నకిలీ పోలీసులుగా అవతారమెత్తారు. అసలు డబ్బులు వారిచేతిలో పడగానే దొంగనోట్లు ఇవ్వకుండా నకిలీ పోలీసులు విజిల్ వేసుకుంటూ వస్తారు. దీంతో అసలు డబ్బులతో బాబన్న గ్యాంగ్ పరారవుతుంది. అసలు డబ్బులు తెచ్చిన వారు భయంతో పారిపోతారు. బాబన్న గ్యాంగ్‌పై 40పైగా కేసులు ఉండేవి.

### నకిలీ నోట్ల ముద్రణ

సాంకేతిక పరిజ్ఞానం, కలర్ ప్రింటర్స్ అందుబాటులో రావడంతో వివిధ ప్రాంతాల్లో నకిలీ నోట్లను ముద్రించి చలామణి చేయడానికి పలు ముఠాలు ప్రయత్నించాయి. పోలీసులు నకిలీ నోట్ల ముఠాలను సమర్ధవంతంగా అణిచి వేశారు. ఉమ్మడి జిల్లాలో తిరిగి రెండేళ్ల నుంచి నకిలీ నోట్లు మార్పిడి ప్రారంభమైంది. జంగారెడ్డిగూడెం కేంద్రంగా నకిలీ ఆగడాలు వెలుగు చూస్తున్నాయి.

### బొమ్మ కరెన్సీతో మాయ చేస్తున్నారు

జంగారెడ్డిగూడానికి చెందిన కొంత మంది చిల్డ్రన్స్ కరెన్సీని అసలు నోట్లు సైజులో తయారుచేసి వాటిని నకిలీ నోట్లుగా ఎదుటి వారికి ఆశ చూపించి అసలు నోట్లు లక్షకు ఐదు లక్షలు నకిలీ నోట్లు ఇచ్చేవిధంగా ఒప్పందం చేసుకుని మోసానికి పాల్పడుతున్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌లో కేసు నమోదు చేసి ముఠాను అరెస్టు చేశారు.

ద్వారకాతిరుమల మండలం టి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడూరు రవితేజ కొంతకాలం జంగారెడ్డిగూడెంలో ఉంటూ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నాగూర్ మీరావలి, వీరంకి రాజేష్ ముఠాగా ఏర్పడి దొంగనోట్లు మారుస్తున్నారు. ద్వారకాతిరుమలలో హోటల్ నిర్వహి స్తున్న వ్యక్తి అసలు నోట్లకు ఆరు రెట్లు దొంగనోట్లు ఇస్తామని నమ్మబలికారు. భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ సుధీర్, సిబ్బంది కలిసి ముఠా ఆటకట్టించారు. మోసపోయిన వారిలో అతి తక్కువ మంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. కొందరు భయపడి లేదా పరువు పోతుందని పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఇది ఆసరాగా తీసుకుని నకిలీ నోట్ల ముఠా ఆటలు కొసాగుతున్నాయి.

### పోలీసులే విస్తుపోయేలా..!

నకిలీ ముఠాల మోసాలకు పోలీసులే విస్తుపోతున్నారు. జంగారెడ్డిగూడెంలో ముఠా సభ్యులు నల్ల కాగి తాలను కరెన్సీ నోట్ల సైజులో కట్ చేసి వాటిని ద్రావ ణాల్లో కలిపితే అసలు నోట్లు వస్తాయని అమాయకు లకు ఆశ చూపించారు. నోట్ల మార్పిడి సమయంలో జం గారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న రూ.500 నోట్లపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా అని ఉండడంతో పోలీసులే అవాక్కయ్యారు. ఇటీవల ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కెనరా బ్యాంక్ పరిధిలో రూ.100 నోట్లు జమ చేయడానికి ప్రయత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, మార్కెట్లో, షాపింగ్ మాల్స్‌లో నోట్లను మార్చడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. సాధారణంగా ఏదైనా వస్తువు కొన్న తరువాత ఇచ్చే నోట్లను పరిశీలించు కోవాలి. వస్తువులు కొన్న తరువాత ఇచ్చిన నోట్లను చూసుకోకుండానే చాలామంది వెళ్లిపోతుంటారు. ఇలాంటి సమయంలోనే దొంగనోట్లు చేతులు మారే అవకాశం ఎక్కువగా ఉంది. నకిలీ ముఠాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



## కొలువుకు వేళాయె..

- డీఎస్సీ-2025 నియామక ప్రక్రియ దాదాపు పూర్తి
- 15న ఉమ్మడి జిల్లా అభ్యర్థుల తుది జాబితా విడుదల
- ఎంపికైన అభ్యర్థులకు రాజధానిలో నియామక పత్రాలు
- ఏర్పాట్లు చేస్తున్న విద్యా శాఖ అధికారులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియ నిర్ణీత మార్గదర్శకాల మేరకు దాదాపు పూర్తికావడంతో తుది జాబితా ఈ నెల 15న విడుదల చేయనున్నారు. 19న విజయవాడలో నియామక పత్రాలు అందజేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను విజయవాడ తరలించడానికి పాఠశాల విద్య ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1074 పోస్టుల నియామకాలకు మెరిట్ కం రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం సెలక్షన్ జోన్ పరిశీలనకువచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. అదే సమయంలో వారికి నిర్ణీత అర్హతలున్నదీ, లేనిదీ ఉమ్మడి జిల్లా ఎంఈవోల నేతృత్వంలో సీనియర్ ప్రధానోపాధ్యాయుల కమిటీలతో పలు మార్లు నిశిత పరిశీలన చేయించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా విడుదలకు రంగం సిద్ధం చేశారు.

### వైకల్య శాతంపై నిశిత పరీక్షలు

డీఎస్సీలో దివ్యాంగుల కోటాలో అభ్యర్థుల ఎంపిక విద్యాశాఖకు సవాల్‌గా మారింది. వివిధ వైకల్యాల నిర్ధారణకు ప్రభుత్వ ఆసుపత్రులు జారీచేసే సదరం సర్టిఫికెట్లలో అనర్హులున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఆ ధ్రువపత్రాలను పక్కనపెట్టి గుంటూరు, ఏలూరు, విజయవాడల్లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల మెడికల్ బోర్డులతో నిశితంగా పరిశీలించి అభ్యర్థుల వైకల్యాన్ని నిర్ధారించారు. ఐదు దఫాలు మెడికల్ బోర్డు వైద్య నిపుణులు పరీక్షించడం విశేషం. తాజాగా తిరస్కారానికి గురైన ముగ్గురు దివ్యాంగ అభ్యర్థుల స్థానంలో తదుపరి మెరిట్‌లోవున్న మరో ముగ్గురిని ఎంపికచేస్తూ ఐదో జాబితా గురువారం జిల్లాకు పంపగా, వారందరికీ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అసెస్మెంట్ టెస్టులు చేయించారు. వీరిలో దృష్టిలోపం వున్న ఒక అభ్యర్థికిమాత్రమే నిర్ణీత వైకల్యశాతం ఉన్నట్టు నిర్ధారణకాగా, వినికిడిలోపం (హెచ్‌ఐ)వున్న మరో ఇద్దరిని తిరస్కరించారు.

### విజయవాడకు 50 బస్సులు

ఉమ్మడి జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు విజయవాడలో ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తారు. ఎంపికైన అభ్యర్థులను విజయవాడకు తరలించడానికి ఏలూరు కేంద్రంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 50 బస్సులు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో అభ్యర్థి వెంట మరొకరిని తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులంతా తమ హాల్ టిక్కెట్లనే గుర్తింపు పత్రంగా చూపించాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులంతా విజయవాడకు చేరుకునే ఒదుకు ఈ నెల 18న సాయంత్రం 4గంటలకు చేరు కోవాలి. వారందరికీ 18న రాత్రి భోజనం, వసతి సౌకర్యం, 19న ఉదయం అల్పాహారం, తదితర ఏర్పాట్లను కల్పించడానికి విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటప్పయ్య నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఏలూరులో వసతి ఏర్పాట్లు

అభ్యర్థులు విజయవాడ వెళ్లడానికి సొంత ఏర్పాట్లు అనుమతించబోమని అసిస్టెంట్ డైరెక్టర్ వివరించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ఏలూరులో వారికి కేటాయించిన పాఠశాలకు చేరుకున్న దగ్గర నుంచి విజయవాడలో కార్యక్రమం పూర్తయ్యేవరకు జిల్లా విద్యాశాఖ నియంత్రణలోనే ఉండాలి. ఒక్కో బస్సుకు ఒక ఎంఈవోని పర్యవేక్షకుడు, నలుగురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులను సూపర్‌వైజర్లుగా నియమిస్తు న్నారు. అభ్యర్థులకు వసతి నిమిత్తం మొత్తం 10 పాఠశాలలను ఎంపిక చేశారు. కస్తూరిబా బాలికోన్నత పాఠశాల, సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలు, గాంధీనగర్ మునిసిపల్ హైస్కూలు, సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూలు, సెయింట్ గ్జేవియర్ హైస్కూలు, సెయింట్ థెరిసా బాలికోన్నత పాఠశాల, శనివారపుపేట జడ్పీ హైస్కూలు, శాంతినగర్ శ్రీచైతన్య హైస్కూలు, శాంతినగర్ శశి హైస్కూళ్లను డీఎస్సీ అభ్యర్థులకు వసతి నిమిత్తం ఎంపిక చేశారు.

## పాము కాటుకు ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ తోటలో గెలలు కోస్తుండగా ప్రమాద వశాత్తు పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అత్యవసర విభాగపు వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సరిపల్లి ఏసుపాదం(49) గురువారం ఉదయం పోలాశివుడు గ్రామంలోని ఒక రైతు పొలంలో గెలలు కోస్తుండగా పాము కాటు వేసింది.వెంటనే అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేయగా ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఓ షాపు మెట్లపైన మృతి చెంది ఉన్నాడు. ఏలూరు అమీనాపేట చర్చి సమీపంలోని ఒక షాపు మెట్లపై సుమా రు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడు గళ్ళచొక్కా, గ్రీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వ ర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.



మెట్లపై మృతదేహం

## అమెరికాలో కుమారులను అరెస్టు చేస్తామంటూ..

- రూ. 99 లక్షలు కొట్టేశారు..

భీమవరం క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణానికి చెందిన ఇద్దరు వృద్ధదంపతుల వద్ద సైబర్ నేరగాళ్లు భారీగా సొమ్ములు దండుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకయ్య నాయుడు వీధికి చెందిన ఇద్దరు వృద్ధ దంపతుల కుమారులిద్దరూ అమెరికాలో ఉంటున్నారు. వారు తల్లిదండ్రుల అవసరాల నిమిత్తం నెలనెలా కొంత సొమ్మును తల్లిదండ్రుల ఖాతాలో వేసేవారు. వారికున్న ఐదు బ్యాంకు ఖాతాల్లో మొత్తం కోటి రూపాయలు పైనే డబ్బుంది. అయితే సైబర్ నేరగాళ్లకు ఈ విషయం తెలిసి ఏప్రిల్ 22న ఆ వృద్ధ దంపతులకు ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. ఢిల్లీ కెనరా బ్యాంకు అని, అమెరికాలో ఉంటున్న మీ ఇద్దరు కుమారులు క్రెడిట్ కార్డు బిల్లు కట్టలేదని నమ్మబలికాడు. మనీ లాండరింగ్ చట్టం కింద వారికి అరెస్ట్ వారెంట్ జారీ చేస్తామని భయపెట్టారు. అది నిజమని నమ్మిన వృద్ధుడు వెంటనే భయపడి వారి బ్యాంకు ఖాతా వివరాలను అవతలి వారికి తెలియజేశారు. ఆరు విడతలుగా రూ. 99 లక్షలను సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాకు పంపించారు. వీటితో పాటు మరో రూ.60 లక్షలు ఇవ్వాలని చెప్పగా భయంతో ఇల్లు అమ్మాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం అమెరికాలో ఉంటున్న ఒక కుమారుడికి చెప్పగా, అతను వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## మనస్థాపంతో మెకానిక్ ఆత్మహత్య

భీమవరం క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):మనస్థాపానికి గురైన ఒక మెకానిక్ తాను ఉంటున్న ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మల్లోజు సునీల్ కుమార్(39) 18వ వార్డు బందారు మల్లేశ్వరరావు వీధిలో కుటుంబంతో అద్దెకు ఉంటున్నాడు. అతను పట్టణంలోని ఒక మెకానిక్ వద్ద పని చేస్తున్నాడు. అయితే ఇటీవల పని ఒత్తిడి, మద్యానికి బానిస అవ్వడంతో మనస్థాపానికి గురై ఈ నెల 10వ తేదీన సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. పాఠశాల నుంచి వచ్చిన కుమార్తె చూసి చుట్టుపక్కల వారికి చెప్పడంతో కిందికి దించారు. భార్య సత్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు.

## 16 నుంచి స్వచ్ఛతా పఖ్వాడా కార్యాచరణ

- దసరా సెలవుల్లో నిర్వహించేదెవరు?!

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత పఖ్వాడా-2025 కార్యక్రమాల అమలుకు సమగ్రశిక్ష గురువారం కార్యాచరణను విడుదల చేసింది. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజున స్వచ్ఛత శపథం కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొనాలి. పాఠశాలను పరిశుభ్రపర్చడంతో ఇది ప్రారంభమవుతుంది. 17న నీటి, పారిశుద్య సదుపాయాల తనిఖీ, మరమ్మతులకోసం ప్రణాళికను రూపొందిస్తారు. 18న ఎస్‌ఎంసీ/పీటీఏ సమావేశాలు నిర్వహించాలి. చేతులు కడుక్కోవడం, హైజీన్, నీటి సంరక్షణ, వర్షపునీటి సేకరణపై అవగాహన కలిగిస్తారు. 19న శుభ్రమైన తరగతి గదులపై పోటీలు, పాఠశాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తారు. 20న స్వచ్ఛత-హైజీన్‌పై వ్యాసరచన, నినాదాలు, కవితా రచనపోటీలు నిర్వహిస్తారు. 21న స్వచ్ఛభారత్ సందేశాలతోకూడిన పెయింటింగ్, మోడల్‌మేకింగ్ పోటీలు జరుగుతాయి. 22న పర్యావరణం, శుభ్రత, నీటి సంరక్షణ అంశాలపై వక్తృత్వ, క్విజ్ పోటీలుంటాయి. 23న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధ దినంగా పాటిస్తారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపేయడంపై సమాజంలో అవగాహన కల్పించాలి. 24న పాడైన ప్లాస్టిక్ వస్తువులు, పాత ఫర్నీచర్, వాడిన మాస్కులు, తదితర చెత్తను తొలగించే దినంగా కార్యక్రమాలు ఉంటాయి. 25న పాఠశాలల్లో మొక్కలు నాటడం, గ్రీనరీ కార్యక్రమాలు, 26న చేతుల కడుక్కోవడం అవగాహన దినంగా విద్యార్థులకు డెమో, పాటలు/స్లోగన్స్‌ద్వారా వివరిస్తారు. 27న ఎన్‌ఎస్‌ఎస్/ఎన్‌సీసీ/యూత్ క్లబ్‌ల భాగస్వామ్యంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, 28న ప్రతీరోజూ తరగతి గదులు, లాబీలు, టాయిలెట్లను పరిశుభ్రపర్చడంపై ప్రత్యేక డ్రైవ్ ద్వారా వివరించాలి. 29న గ్రామం, పట్టణాల్లో విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛత అవగాహన ర్యాలీలు, 30న స్వచ్ఛత ప్రదర్శన, ఉత్తమ పాఠశాలలకు బహుమతులు అందజేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

### దసరా సెలవుల్లో ఎలా?

కేంద్రప్రభుత్వ పథకమైన స్వచ్ఛతా పఖ్వాడా కార్యాచరణను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 16నుంచి 30వ తేదీ వరకు అమలు చేయడానికి సమగ్రశిక్ష సీమ్యాట్ విభాగం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో పాఠశాలలకు దసరా సెలవులు ఈ నెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రకటించిన విషయం విదితమే. సెలవురోజుల్లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాల నిర్వహణ ఎలాఅన్నది డైలమా నెలకొంది. ఇదే విషయమై సమగ్రశిక్ష సీమ్యాట్ లెక్చరర్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ బి.సురేష్‌కుమార్‌ను గురువారం రాత్రి ఫోన్‌లో వివరణకోరగా, దేశవ్యాప్తంగా ఒకేరీతిన నిర్వహించేలా కేంద్రప్రభుత్వం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాలకు డిజైన్‌చేసిందని, దీనికి అనుగుణంగానే తాము కార్యాచరణను విడుదల చేశామన్నారు. దసరాసెలవులు ఉన్నందున ఈ కార్యాచరణను సెలవుల అనంతరమే నిర్వహించేలా అనుమతికోసం సమగ్రశిక్ష ఎస్పీడీకి శుక్రవారం అభ్యర్థించి, సవరించిన షెడ్యూలును ప్రకటిస్తామని వివరించారు.

## ఛీట్..ఫండ్

- ఏలూరులో నమ్మించి రూ.5 కోట్లతో చిట్ ఫండ్ బోర్డు తిప్పేసిన దంపతులు..
- బాధితుల గగ్గోలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ఏలూరులో అనధికారికంగా లిఖిత చిట్‌ఫండ్స్ నిర్వహిస్తున్న దంపతులు బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఏలూరు శాంతినగర్ 13వ రోడ్డులో నివాసం ఉంటున్న వేమూరి లక్ష్మి ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతోంది. ఆమె భర్త రవీంద్ర చౌదరి వ్యవసాయం చేస్తుంటారు. ట్యూషన్‌కు వచ్చే పిల్లల తల్లిదండ్రులతో పరిచయాలు పెంచుకుని నెమ్మదిగా చిట్టీలు వేయడం మొదలు పెట్టారు. కొన్ని సంవత్సరాల నుంచి చిట్టీలు వేస్తున్న నేపథ్యంలో 10లక్షల నుంచి 25 లక్షల చిట్టీ కూడా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా పేర్లు రాసి అందరి ముందేతీసి పేరు ప్రకటించేవారు. పారదర్శకంగా చేస్తున్నారంటూ ప్రజల్లో మరింత నమ్మకం కలిగింది. క్రమేపీ బ్రోకెన్ చిట్టీ పేరుతో అందరికీ వల వేశారు.పది లక్షల రూపాయల చిట్టీ ఒకరు 8 నెలలు కట్టి మానేశారని మిగతా సొమ్ము చెల్లిస్తే మీకే వస్తుందని నమ్మబలికి ఆశలు కల్పించారు. ఈ విధంగా ప్రతి ఒక్కరిని మధ్యంతరంగా చిట్టీ సొమ్ముల్లో చేర్పేసుకున్నారు. ఇదే విధంగా మెస్సేజ్‌లు పెట్టడం ఎంతో నమ్మకంగా చీట్ల వ్యాపారం నిర్వహించారు. విదేశాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని నమ్మబలికి లక్షల రూపాయలు కట్టారు. చిట్టీ గడువు తీరిపోయినా వచ్చే సొమ్మును పెట్టుబడి రూపాల్లో పెట్టించేశారు. చివరకు గత ఆరు నెలల నుంచి ఎవరికి ఒక్క పైసా కూడా ఇవ్వకుండా సభ్యుల నుంచి వసూలు చేశారు. ఈ నేపథ్యంలో అంతా ఇంటికి వచ్చి అడగడం, వాయిదాలు పెట్టడం జరుగుతోంది. అకస్మాత్తుగా ఇంటికి తాళం వేసి భార్యా భర్తలు వెళ్లిపోయారు. మొబైల్స్ స్విచ్ ఆఫ్ చేయడంతో బాధితులు రెండు రోజుల నుంచి వారి ఇంటి చుట్టు తిరిగారు. మోసపోయామని గ్రహించి చివరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు 10వ తేదీ రాత్రి ఫిర్యాదు చేశారు. శాంతినగర్ 12వ రోడ్డునకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాగం శైలజ పిల్లలు వేమూరి లక్ష్మి వద్ద ట్యూషన్‌కు వెళ్తూ ఉంటారు. ఆ పరిచయంతో శైలజ నుంచి రూ. 55 లక్షలు కట్టించారు.మరో వ్యక్తికి రూ.80 లక్షలు ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకొకరికి రూ. 30 లక్షలు, విడివిడిగా పలువురికి మరో 30 లక్షలు ఇవ్వాలని వారు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ సుమారు రెండు కోట్ల రూపాయలపై ఫిర్యాదులు అందాయి. అయితే ఐదు కోట్ల వరకూ ఉంటాయని వారు 150 మంది నుంచి సొమ్ములు వసూలు చేసినట్టు చెబుతున్నారు. బాధితులు ఒకొక్కరు గురువారం రాత్రి కూడా బాధితులు త్రిటౌన్ చేరుకుని ఫిర్యాదు చేశారు. సీఐ వి.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కనిపించకుండాపోయిన లక్ష్మి, రవీంద్ర చౌదరి



చిట్టీ డబ్బు తీసుకుంటున్న లక్ష్మి

## ఆచూకీ చెబితే లక్ష రూపాయల బహుమతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలోని కనకదుర్గ గోల్డ్‌ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌కి హెడ్ ఆఫీస్ నుంచి ఆడిటర్‌గా వచ్చిన వడ్లమూడి మహేశ్ రెండున్నర కోట్ల రూపాయల విలువైన తాకట్టులో ఉన్న బంగారపు వస్తువులను తన బ్యాగ్‌లో వేసుకుని ఈనెల 9వ తేదీన పరారయ్యాడు. చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. వడ్లమూడి మహేష్ కోసం మూడు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. అతడి ఆచూకీ చెప్పిన వారికి లక్ష రూపాయల బహుమతి ఇస్తామంటూ పోలీసులు ప్రకటించారు. అతని ఆచూకీ తెలిస్తే వెంటనే జంగారెడ్డిగూడెం డీఎస్పీ సెల్ నెంబర్ 94407 96626, చింతలపూడి సీఐ సెల్ నెంబర్ 94407 96674, చింతలపూడి ఎస్‌ఐ సెల్ నెంబర్ 94407 96675కు సమాచారం అందించాలని సూచించారు.



నిందితుడు మహేశ్

## సోదరుడు మరణించాడని చూడటానికి వచ్చి మృత్యువాత

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఓ వృద్ధుడు మృత్యువాతపడ్డాడు. మరణించిన సోదరుడిని చూసేందుకు ఇంటి నుంచి వెళ్లి రైలులో ప్రయాణిస్తూ మార్గమధ్యలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాకినాడకు చెందిన కోటి సూర్యనారాయణ(80) సోదరుడు ఏలూరులో ఈనెల 10వ తేదీన మరణించాడు. అతడిని చూసేందుకు సూర్యనారాయణ కాకినాడలో ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం బయల్దేరి ఏలూరు వెళ్తున్నాని ఇంట్లో చెప్పాడు. గురువారం ఉదయం ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద రైలు పట్టాలపై సూర్యనారాయణ మృత దేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

### పాఠశాలకు మొక్కలు అందజేత

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా ఏలూరు రూరల్ మండలం తిమ్మాపురం మోడల్ ప్రైమరీ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు డీకేఎస్ఎస్ ప్రకాశ్ జాలిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు మొక్కలు, పూల కుండీలను హెచ్ఎం ప్రసాద్, పీఎస్ హెచ్ఎం జి.మోహన్‌లకు గురువారం అందజేశారు.ఉపాధ్యాయులు ఎం.ప్రసాద్‌బాబు, ఎస్. శిరీషరాణి, జె.సత్యశ్రీదీప్తి, జి.విజయశ్రీ, ఎం.శేషు కుమార్, బి.అనంతలక్ష్మి, టి.మాధవి పాల్గొన్నారు.

### మనిషి మనుగడకు ఆధ్యాత్మిక చింతన అవసరం

పెదపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మనిషి మనుగడకు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించాలని సింగపూర్ దేశానికి చెందిన ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు ఆచార్య సింపు రింపచే అన్నారు. వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో నేటి యాంత్రిక యుగంలో మనిషి జీవనం, ఆధ్యాత్మికత అనే అంశంపై ప్రసంగించారు. మనిషిపై పెరిగిన ఒత్తిడి నుంచి బయటపడాలంటే ఆధ్మాతిక భక్తిభావన అవసరమన్నారు. కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్, ఎం.డి. కె.సాయిరోహిత్, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభకు సన్నాహాలు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభకు మండలం నుంచి 14న కొయ్యలగూడెం మార్కెట్ యార్డుకు భారీ సంఖ్యలో ప్రజల తరలి వెళ్లాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎంపీడీవో టి.నిఖిల్ మధు శరణ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, ఎంపీటీసీ నాలి శ్రీను, తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ ఉన్నారు.

● టి.నర్సాపురం:స్త్రీశక్తి విజయోత్సవ సభకు అధిక సంఖ్యలో మహిళలు తరలి రావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విజయోత్సవ సభపై ప్రజాప్రతినిధులు, అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14న కొయ్యలగూడెంలో మార్కెట్ యార్డులో స్త్రీశక్తి విజయోత్సవ సభ జరుగుతుందన్నారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, తహసీల్దార్ సాయిబాబా, ఎంపీడీవో నగరాజ కుమారి, కొత్తా రామారావు, కొల్లి రమేశ్, నవీన్, అద్దంకి జగ్గారావు, మండల విద్యాశాఖాధికారి రాంమూర్తి, ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలి : ఆప్టా

పెదవేగి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ఈనెల 22వ తేదీ నుంచి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది రెండురోజులు ఆలస్యంగా సెలవులు ప్రకటించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 22వ తేదీనుంచే దసరా సెలవులు ప్రకటించారని, హిందువుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించాలని అధ్యక్షప్రధాన కార్యదర్శులు మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు.

### నిబంధనల మేరకే బార్ లైసెన్స్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తనకు ప్రభుత్వ నిబంధనల మేరకే బార్ కేటాయించారని, దీనిపై కొందరు శెట్టిబలిజ సంఘం నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని బైరెడ్డి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్డీవోను కలిసి వివరించినట్టు ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో లైసెన్స్ కోసం శెట్టిబలిజ కోటాలో తనతో పాటు మరో నలుగురు టెండర్ వేశారన్నారు. లాటరీలో టెండర్ తనకు దక్కిందన్నారు. పీజీఆర్ఎస్‌లో కొందరు శెట్టిబలిజ నాయకులు ఫిర్యాదు చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తాను శెట్టిబలిజ కులానికి చెందిన వాడినే అని వివరణ ఇచ్చారు. తప్పుడు ఫిర్యాదులు చేసి, అసత్య ఆరోపణ చేస్తూ బెదిరింపులకు దిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

### సవరించిన జీఎస్టీ రేట్లను ఉత్పత్తులపై ముద్రించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు ఈ నెల 22 నుంచి అమలు కానున్న నేపథ్యంలో కేంద్ర ఆహార వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద జోషికి కన్స్యూమర్, డిస్ట్రిబ్యూటర్లు లేఖరాశారు. ప్రస్తుతం ఉన్న ఉత్పత్తుల నిల్వలపై జీఎస్టీ రేట్లలో మార్పులకు అనుగుణంగా సవరించిన విక్రయ ధర ముద్రించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించారని వెస్ట్ గోదావరి ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రోడక్ట్ డిస్ట్రిబ్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్ తెలిపారు. సవరించిన ఎంఆర్పీ ముద్రించాలని తయారీదార్లకు కేంద్ర ప్రభుత్వం సూచించినట్టు తెలిపారు. స్టిక్కర్ స్పష్టంగా కనిపించాలని ఆదేశించినట్టు మంత్రి పేర్కొన్నారని సత్యకుమార్ తెలిపారు.పాత ధర కూడా కనిపించేలా ఉంటేనే.. జీఎస్టీ రేట్ల సవరణ రూపేణ పాత, కొత్త రేట్ల మధ్య వ్యత్యాసం వినియోగదార్లకు తెలుస్తుందని వివరించానన్నారు.

### జాతీయ సహకార సదస్సుకు గన్ని వీరాంజనేయులు

ఏలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): న్యాప్‌కార్డు(బోర్డుమీటింగ్ ఆఫ్ నేషనల్ కో-ఆపరేటివ్ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం సిమ్లాలో ఈ నెల 13,14వ తేదీల్లో జరిగే జాతీయ సహకార సదస్సుకు రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్, ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన సిమ్లాకు శుక్రవారం రాత్రి పయనం కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పలు అంశాలపై చర్చించనున్నారు. 13న పాల ఉత్పత్తి సంఘాలు పాత్ర, కో-ఆపరేటివ్ బ్యాంకింగ్‌లో టెక్నాలజీ వినియోగం తదితర అంశాలపై సమీక్షిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన రాష్ట్రాలకు నాఫ్స్‌కాబ్ ఉత్తమ అవార్డులను అందివ్వనున్నారు. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలవగా, ఏపీలోని ఆప్కాబ్‌కు రెండో స్థానం దక్కింది.ఈ మేరకు హిమాచల్‌ప్రదేశ్ సీఎం చేతుల మీదుగా గన్ని అవార్డును 14న అందుకోనున్నారు.

### బాల్య వివాహాల నిరోధానికి సమష్టిగా కృషి చేయాలి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నిరోధించడానికి సమిష్టిగా కృషి చేయాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయసేవాధికార సంస్థ భవనంలో గురువారం బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, పనిచేసే ప్రదేశాలలో మహిళలపై జరిగే లైంగిక వేధింపులు నివారణ చట్టాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వివిధ కమ్యూనిటీ పరిధిలో సన్నిహితంగా పనిచేస్తూ ఉంటారని, ప్రతి గ్రామంలో బాల్యవివాహాలను నిరోధించడానికి తమ వంతు కృషి చేయాలన్నారు.అటు వంటి సంఘటనలు ఎదురైన సంబంధిత అధికారులకు గాని లేదా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కాని తెలియజేయాలన్నారు. ట్రైనీ మాస్టర్ పి.రత్నరాజు, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ ఛైల్డ్ వెల్ఫేర్ పీడీ ఎ.శారద, డీసీపీవో సి.హెచ్.సూర్యచక్రవేణి, సీడీపీవోలు తులసి, పద్మావతి పాల్గొన్నారు.

### గారపాటి విమల సేవలు ఆదర్శనీయం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళా సామాజిక ఉద్యమాలు నిర్వహించిన గారపాటి విమల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. గురువారం శనివారపుపేట హేలాపురి లయన్స్ ఆడిటోరియంలో జరిగిన గారపాటి విమల సంస్మరణ సభను సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించారు. వక్తలు ఈ సందర్భంగా విమల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

### సత్యసాయి సేవా సమితి సభ్యుడు గాంధీ బాబు మృతి

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యుడు కె.గాంధీబాబు గురువారం తెల్లవారు జామున తన నివాసంలో మృతి చెందారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుతూ సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గాంధీబాబు కుటుంబ సభ్యుల అనుమతితో ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రికి గాంధీబాబు నేత్రాలను దానం చేశారు. సత్యసాయి సేవా సంస్థ అధ్యక్షులు కానుమిల్లి శశిశేఖరరావు, సేవా సంస్థ ప్రతినిధులు, భజన సంకీర్తన బృందం ఉన్నారు.

### విద్యార్థినిపై వీధి కుక్క దాడి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):ద్వారకాతిరుమలలోని చెరువువీధిలో స్కూల్‌కు వెళ్తున్న ఓ విద్యార్థినిపై వీధికుక్క దాడికి య త్నించింది. బాలిక ప్రాణ భయంతో పరుగులు తీసి తల్లిని చేరుకుంది. దీంతో కుక్క వెనక్కి త గ్గింది. ఇదంతా సీసీ కెమేరాలో రికార్డయ్యింది. గత కొంతకాలంగా ద్వారకాతిరుమలలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అయినా పాలకులు అధికారులు పట్టించుకో వడం లేదు. మండలంలోని పలు ప్రాంతాల్లో కుక్కల దాడి ఎక్కువై ప్రజలు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## తిరిగొస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

రేపాకగొమ్ము,తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్లవరం, చిగురు మామిడి, గ్రామాలకు చెందిన ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రేపాకగొమ్ముకు చెందిన సుమారు వంద కుటుంబాలు చెల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీకి, కుక్కునూరు మండలం దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలకు తరలివెళ్లి రెండునెలలుగా అక్కడే ఆశ్రయం పొందుతున్నారు. మిగిలిన గ్రామాల ప్రజలు మండలంలోని మెరక ప్రాంతాల్లో ఇళ్ల అద్దెకు తీసుకుని అక్కడికి తరలివెళ్లారు. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో ఈ మండలానికి వరదముంపు పొంచి ఉంటుంది. అయితే ఈ సారి గోదావరి వరద గడిచిన రెండునెలల్లో నాలుగుసార్లు లోతట్టు ప్రాంతాలు రహదారులను ముంచివేసిందే తప్ప గ్రామాల్లోకి ప్రవేశించలేదు. ప్రస్తుతం గోదావరి నదీప్రవాహం సాధారణ స్థితికి చేరుకోవడం, వర్షాల భయం తప్పిపోవడంతో వలసవెళ్లిన ప్రజలు తిరిగి గ్రామాలకు సామాన్లు తరలించుకుంటున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం అవడంతో కూలిపనులు దొరకడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. వరదభయం సెప్టెంబరులో అంతగా ఉండదనే అభిప్రాయానికి వచ్చిన మండల ప్రజలు ధైర్యంగా తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు.

# బిల్లులు చెల్లించండి మహాప్రభో..

» కాంట్రాక్టర్ల వేడుకోలు
» ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామంటున్న అధికారులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేసిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం కాంట్రాక్టర్లు 8 నెలలుగా ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో పనులు వేగంగా చేస్తే బిల్లులు కూడా వేగంగా వస్తాయన్న ఉద్దేశంతో గ్రామాల్లో సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశారు. సంబంధిత బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలానికి రూ.2 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. ఒక్కో గ్రామంలో కనీసం రూ20 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. రోడ్డు పనులు పూర్తి చేసి, బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అల్లాడిపోతున్నారు. గ్రామాల్లో రైతులు మినీ గోకులాలు నిర్మించుకున్నారు. పశువులకు నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. వీటికి కూడా బిల్లులు రాకపోవడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. బిల్లులు చెల్లించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని పాడి రైతులు విమర్శిస్తున్నారు. ఇదే విషయమై పంచాయతీరాజ్ శాఖ అధికారులు మాట్లాడుతూ పనులకు సంబంధించి బిల్లుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు తెలిపారు.



పశువుల కోసం నిర్మించిన మినీ గోకులం షెడ్డు

# దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

● బ్రోచర్లను ఆవిష్కరించిన నిర్వాహకులు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని పత్తేబాదలోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ధర్మకర్తల మండలి చైర్మన్ పృధ్వి సత్యనారాయణమూర్తి, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్‌కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్లను ఆలయ ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. 37వ డివిజన్ కార్పొరేటర్ నాయుడు శారద-సోము దంపతులతో ఆలయ అర్చకులు ప్రయాగ వెంకట్రామమూర్తి రాట పూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, సామూహిక పారాయణలు ఉంటాయన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

### గంగానమ్మ ఆలయంలో..

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత గంగానమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న ట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. గంగానమ్మ అమ్మవారి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులు అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

### పోలేరమ్మ సన్నిధిలో చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని పోలేరమ్మను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌కు ప్రత్యేక పూజలు చేశారు.అర్చకులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు ఇచ్చి, గౌరవించారు.

### కొవ్వలి విద్యార్థుల విజ్ఞాన యాత్ర

దెందులూరు,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొవ్వలి జడ్పీ హైస్కూల్ పీఎంశ్రీ ప్లస్ స్కూల్ విద్యార్థులు విహార, విజ్ఞానయాత్రలతో గురువారం వివిధ ప్రాంతాల్లో సందడి చేశారు. స్కూల్ హెచ్ఎం ఎస్‌వీఎస్ శర్మ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం సమీపంలో ఉన్న ఉద్యానవన యూనివర్సిటీలోని వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. అలాగే నిట్ కేంద్రాన్ని సందర్శించారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈ టూర్‌లో పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

### గ్రామాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు

పెదపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని పెదవేగి ఇనస్పెక్టర్ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు.కొత్తూరు వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను గురువారం నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వాహనం రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు.

#### దెందులూరు మండలంలో..

దెందులూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏలూరు మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ ఎండీ జమీర్ అన్నారు .గురువారం మండలంలోని గాలాయగూడెం, గంగన్నగూడెం, సోమవరప్పాడు గ్రామాల పరిధిలో తంగెళ్లమూడి-జంగారెడ్డిగూడెం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, వాహనం పత్రాలు సక్రమంగా ఉండాలని సూచించారు.

### బండివారిగూడెం వద్ద లారీ బోల్తా

టి.నర్సాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండివారిగూడెం సమీపంలో జామాయిల్ కలపలోడుతో వెళ్తున్న లారీబోల్తాకొట్టింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పింది. యర్రగుంటపల్లికి చెందిన లారీ చింతలపూడిలో జామాయిల్ కలప లోడు చేసుకుని చింతలపూడి నుంచి రాజమండ్రిపేపర్ మిల్లుకు వెళ్తూ బండివారిగూడెం వద్ద బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు నీటిప్రవాహంలో రోడ్డు కనిపించకపోవడంతో గుంతలో పడి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సురక్షితంగా బటయపడ్డాడు.



### రూ.2.72 లక్షల విలువైన ఎరువుల సీజ్

ఏలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా పలుచోట్ల ఎరువుల దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించి, 2లక్షల 72వేల 600 విలువైన ఎరువులను సీజ్ చేశారు. వివిధ ప్రాంతాల్లో రెండు బృందాలుగా అధికారులు విడిపోయి దాడులను చేపట్టారు. దెందులూరు మండలం రామారావుగూడెంలో సాయికృష్ణ మెన్యూర్, జనరల్ స్టోర్స్, మణికంఠ ట్రేడర్స్, బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెంలో దేవి ఎంటర్‌ప్రైజెస్, లీలాకృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీలు చేశారు.

### అదనపు విధుల నుంచి విముక్తి కల్పించండి

నిడమర్రు సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తీవ్ర పని భారంతో మనోవేదనకు గురిచేస్తున్న వలంటీరు విధుల నుంచి విముక్తి కలిగించాలని సచివాలయ ఉద్యోగులు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు. గురువారం నిడమర్రు సచివాలయ ఉద్యోగులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగుల నిరసన అనంతరం ఎంపీడీవో ఎస్.తిరుపతి స్వామికి వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

### నేపాల్‌లోని తెలుగువారిని రక్షిస్తాం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యంగా టీడీపీ పని చేస్తుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. నేపాల్‌లో చిక్కుకుపోయిన 215 మంది తెలుగువారిని రాష్ట్రానికి రప్పించడంలో మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తెలుగువారు ఎక్కడ ఆపదల్లో ఉన్న వారికి అండగా నిలబడతామన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిపై జగన్‌కు బెంగలేదన్నారు.

● భీమడోలు: నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని ప్రభుత్వం సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడం పట్ల ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో మంత్రి లోకేశ్ నేపాల్ నుంచి తెలుగువారిని సురక్షితంగా ఇంటికి చేర్చారని అన్నారు.కరుం పెద్దిరాజు, శేషపుగిరి, గంగాధర్, రామకృష్ణ, వెంకేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

### రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలి

చింతలపూడి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరిపడా ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు కోరారు. మండలంలో యూరియా కొరతలేదని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడం సరికాదన్నారు.రైతులు ఎంతభూమి సాగు చేశారో తెలుసుకుని యూరియా ఇవ్వాన్నారు.

### పాలవాగు కార్యాలయం ప్రారంభం

లింగపాలెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):రైతుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పాలవాగు సప్లైచానల్ అధ్యక్షుడు మోరంపూడి వర ప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో పాలవాగు సప్లైచానల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మేకలరాధ, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ సుధాకర్, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, గారపాటి సాయి, గజ్జా వెంకటేశ్వరరావు, చల్లా నాగబాబు, కొత్తూరి నాగమణి, నాయకులు పాల్గొన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

### కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకాకు సత్కారం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమ్మకార్పొరేషన్ డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన, టీడీపీ మండలాధ్యక్షుడు లంకా సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని మారంపల్లిలోని ఆయన స్వగృహంలో పలువురు ఆయనను కలిసి అభినందించారు. గోపాలపురం ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.వి.వి.ప్రకాశ్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఉండి మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు.

### రెండోరోజు కొనసాగిన జట్ల ఎంపిక

పెదవేగి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో జరుగుతున్న 19ఏళ్ల విభాగం క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో గురువారం రెండోరోజు కొనసాగాయి. రెండోరోజు పోటీల్లో బాల, బాలికలకు కుస్తీ, ఫుట్‌బాల్, సెపక్ తక్రా పోటీలు నిర్వహించి, ప్రతిభ కలిగిన క్రీడా కారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని డీపీఈవో టి.శేఖర్‌బాబు తెలిపారు.ఈ ఎంపిక పోటీల్లో ఆర్‌ఐవో యోహాను, డీసీవో ఉమాకుమారి, గురుకులం ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు పాల్గొన్నారు.

### జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని మర్యాద పూర్వకంగా కలిసిన పీఆర్ ఎస్ఈ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ రమేశ్ బాబు గురువారం జడ్పీ క్యాంపు కార్యాలయంలో జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పనుల నాణ్యత, వేగం, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు.

### పెరిగిన వర్జీనియా పొగాకు ధర

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మూడ్రోజులుగా వర్జీనియా పొగాకు ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. సోమవారం ధర రూ.376 ఉండగా మంగళ, బుధ వారాల్లో ఒకేసారి రూ.14 పెరిగి రూ.390 చేరింది. గురువారం మరో రూ.5 పెరిగి 395కి చేరింది. గత ఏడాది రికార్డు స్థాయిలో కిలో రూ.411 చేరగా ఈ ఏడాది వేలం ముగిసే సరికి గత సంవత్సరం రికార్డును దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. 95శాతం పంట అమ్ముకున్నాక ధరలు పెరగడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువ గ్రేడు పొగాకు మాత్రం రూ.200 దాటడంలేదు.

### మూఢ విశ్వాసాల నిరోధక చట్టం తేవాలి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూఢ విశ్వాసాల నిరోధక చట్టం తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రమేశ్ అన్నారు. ఆర్ఆర్.పేటలో జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సమావేశం జరిగింది. రిటైర్డ్ జడ్జ్ అడబాల లక్ష్మి మాట్లాడుతూ నేటి చిన్నారులకు స్వచ్ఛమైన పర్యావరణహితమైన సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆప్టా చైర్మన్ ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత పథకాలు ఇవ్వకుండా ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు. జిల్లా మాజీ అధ్యక్షులు వై.పైడియ్య మాట్లాడుతూ మూఢ నమ్మకాల నుంచి తమ కుటుంబాలను, సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. న్యాయవాది స్వరూపరాణి మాట్లాడుతూ మహిళా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. అధ్యక్షుడిగా వీ.ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శిగా కె.వి.నారాయణరావు, కోశాధికారిగా అఖిల్, పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత

దెందులూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చల్లంతలపూడి సంస్కృత ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లేశ్వరితో కలిసి 110 మంది విద్యార్థులకు చింతమనేని అందించిన నోటు పుస్తకాలను మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు, పార్టీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణలతో కలిసి అందజేశారు. ఉప సర్పంచ్ సత్యనారాయణ(నాగు), కోటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ వై.నాగరాజు పాల్గొన్నారు.

### జిల్లాలో యూరియా కొరత లేదు : బాషా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతుల అవసరాలకు తగ్గట్లు ఎరువులు సరఫరా చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్కే హబీబ్‌బాషా తెలిపారు. గురువారం శనివారపుపేట సొసైటీలో ఏడీఏ అనిలా కుమారితో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. గోదాంలో ఎరువుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి జీవన సంధ్య ఉన్నారు.

### 14న న్యాయవాదులతో ధర్మ సమ్మేళనం

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయవాడ గొల్లపూడి అయ్యప్పస్వామి గుడి వద్ద పద్మావతి ఫంక్షన్ హాల్లో ఈనెల 14న పూజ్య స్వామీజీలతో హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు మాజీ బార్ అధ్యక్షులు, న్యాయవాది కృష్ణ కుమార్, ఏలూరు న్యాయవాది కనమర్లపూడి సుబ్బారావులు తెలిపారు. గురువారం దివ్యజ్ఞాన సమాజం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ధర్మ సమ్మేళనానికి 14 మంది పీఠాధిపతుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 150 బార్ అసోసియేషన్ల నుంచి 1500 మంది హిందూ న్యాయవాదులు హాజరవుతారని చెప్పారు. దేవుడి భూములు రక్షించుకోవడానికి వెబ్ సైట్‌ను ఆ రోజు ప్రారంభిస్తామని కృష్ణకుమార్ తెలిపారు.

### పోలసానపల్లి పాఠశాలకు ఉత్తమ అవార్డు

భీమడోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి నెంబర్ -2 ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించినట్టు పాఠశాల హెచ్ఎం చింతలపూడి శ్రీలక్ష్మి దుర్గ తెలిపారు. ఈ మేరకు హెచ్ఎంకు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయ అధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని విలేకర్లకు తెలిపారు. పాఠశాలలో నిర్వహించే విద్యాబోధన, కృత్యాలు సోషల్ మీడియా ద్వారా విద్యాశాఖకు చేరడంతో ఈ గుర్తింపు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ రహీమాబేగం, ఎంఈవో శ్రీనివాసరావు,భాస్కరరావు, గ్రామ పెద్దలు, హెచ్ఎం ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### చింతలపూడి తహసీల్దార్‌గా స్లీవజోజి

చింతలపూడి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండల తహసీల్దార్‌గా కె.స్లీవజోజి గురువారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయన జంగారెడ్డిగూడెం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. చింతలపూడి తహసీల్దార్ ప్రమద్వర సెలవుపై వెళ్లడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కోసం కొమరం భీమ్ నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో సుమారు 50మంది ఆదివాసీయులు మండలంలోని గుండుగొలనుకుంటను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కొమరం భీమ్ నుంచి వచ్చిన వారు గ్రామంలోని ఒబిలిశెట్టి గోపాలకృష్ణ మూర్తికి చెందిన ప్రకృతివ్యవసాయ వనరుల కేంద్రం పరిశీలించారు. పలు అంశాలను వారు పరిశీలించారు. అవగాహన పెంపొందించారు. ఎస్‌పీఎంయూ రాథోడ్, నాబార్డ్ పీడీ సతీశ్, నిర్మల పాల్గొన్నారు.

### నేడు ఎంపీ మహేశ్ పర్యటన

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.పోలవరం నియోజకవర్గంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు, జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

### పాఠశాల ఆకస్మిక తనిఖీ

లింగపాలెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగగూడెం మోడల్ స్కూల్‌ను ఎంఈవో కె.రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగది, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు.విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులును అభినందించారు.

### ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చింతలపూడి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలమపేట ఏరియాలోని ముత్యాలమ్మ ఆలయ 74వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ ఊరేగింపు ఉంటుందన్నారు.

### రాయితీపై కుట్టుమిషన్ల అందజేత

జీలుగుమిల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎందగాలని హోప్ మినిస్ట్రీస్ అధినేత గడ్డం శామ్యూల్ అన్నారు.జీలుగుమిల్లి అంబేద్కర్ యూత్ అధ్యక్షులు ధారా మనోజ్‌కుమార్ సహకారంతో హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రాయితీపై 60 మంది మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేశారు. బాలాజీ, అంబేద్కర్ యూత్ సభ్యులు అరుణ్, మాదవ్, రాజేష్, జనార్దన్, రామకృష్ణ, అనిల్, రామారావు, సంతోష్, అంజిత్ ఉన్నారు.

### 16న మండల సమావేశం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. ఈ నెల 2న జరగాల్సిన సర్వసభ్య సమావేశం సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా పడిందన్నారు. అన్ని శాఖల పురోగతిపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలుంటాయన్నారు.

### రూ.20 వేల ఆర్థిక సాయం

దెందులూరు సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తకు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నాని అందజేశారు. డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

### ఇంటర్నెట్ థింగ్స్‌పై అవగాహన

పెదపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఇంటర్నెట్ థింగ్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు శ్రీనివాసరెడ్డి పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సరళ, భాను ప్రకాశ్, హిమ బిందు, యూనీస్ లక్ష్మి, కంప్యూటర్ హెచ్‌వోడీ కేవీవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



### కంచాల వితరణ

పెదవేగి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయరాయి గ్రామానికి చెందిన బిర్లంగి పెద్దులు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు కంచాలు బహూకరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.ధనకాంత మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి కంచాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని టీడీపీ గ్రామ నాయకుడు బిర్లంగి పెద్దులు దృష్టికి తీసుకెళ్లడంతో బహూకరించారని ఆమె చెప్పారు. ఉపాధ్యాయులు జి.రాజేశ్వరి, డి.పద్మావతి, ఎన్. పద్మశ్రీ, జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

### వైసీపీ గ్రామాధ్యక్షుడిగా రామకృష్ణ

కామవరపుకోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రావికంపాడు వైసీపీ గ్రామాధ్యక్షుడిగా సూతగాని రామకృష్ణను ఎన్నుకున్నారు. వైసీపీ సమావేశంలో మండలాధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ అధ్యక్షత వహించగా పరిశీలకుడు నల్లూరి ప్రభాకరరావు ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా సూతగాని రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా సిలింతరాజుల సుబ్బారావు, చింతపల్లి రాజు, కె.ప్రకాశం, నామిశెట్టి యేసుబాబు, కార్యదర్శులుగా ఏలేటి చార్లెస్,పెనుమాకుల వీరాజు, కుచలపాటి ప్రకాశం, ఎం.సుబ్బారావులను ఎంపిక చేశారు.



కమిటీని అభినందిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం నాణ్యతతో అందించాలని ఎంఈవో-2 జమలయ్య సూచించారు. అన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో పారిశుధ్యం నిర్వహణ, మధ్యాహ్నం భోజన పథకం అమలు, విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి తదితర అంశాలను ఆయన క్షుణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 24న వృక్షాల వేలం : సబ్ కలెక్టర్

నూజివీడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గుర్తించిన స్థలంలో విలువైన వృక్షాలకు ఈనెల 24న బహిరంగ వేలం వేయనున్నట్లు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తెలిపారు. 52 టేకు వృక్షాలు, 82 కొబ్బరిచెట్లు, 5 వేపచెట్లు ఉన్నాయన్నారు. వేలం వివరాలను సబ్ కలెక్టర్ కార్యాలయంలోని నోటీస్‌బోర్డులో ఉంచినట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల వారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు.

## బలివే ఆలయ చైర్మన్‌గా శ్యామలరావు



ముసునూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా కాట్రేనిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మకంటి శ్యామలరావు నియమితులయ్యారు. ఆలయ ధర్మకర్తల మండలి నియామకంపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. చైర్మన్‌గా శ్యామలరావు, ధర్మకర్తలుగా ఎస్.వెంకట సాయి కృష్ణ, జి.గురునాథం, జి.వెంకటేశ్వరరావు, జి.కనకమ్మ, ఎ.మల్లిక, ఎన్.నాగదుర్గ, టి.పద్మావతి, కె.అన్నవరం, పి.నాగేశ్వరరావు, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రధాన అర్చకుడు తోలేటి అరుణ భాస్కరరావును నియమించారు. శ్యామలరావు 15ఏళ్ల సర్పంచ్, పీఏసీఎస్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఆయన నియామకం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, ఎంపీటీసీ సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, మొక్కపాటి వెంకట రామారావు, వేంపాడు డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, గూడపాటి అజయ్‌కుమార్, రాపర్ల ప్రతాప్ శ్యామలరావుకు అభినందనలు తెలిపారు. త్వరలో మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జగుతుందని చైర్మన్ తెలిపారు.

## ఎన్టీఆర్ వైద్య సేవల్లో ఏరియా ఆస్పత్రి ముందుండాలి

నూజివీడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఏరియా ఆసుపత్రి ఎన్టీఆర్ వైద్యసేవలు అందించటంలో ముందువరుసలో ఉండాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్య అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో వైద్య పరికరాల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యవసర సేవలందించడంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చెత్త సేకరణ పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

ముసునూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో శ్రీహరి హెచ్చరించారు. రమణక్క పేటలో గురువారం చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ కాల్స్‌లో స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పంచాయితీ కార్యదర్శి సుజాత, పారుశుధ్య కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఎంపిడివో బి.ఏ సత్యనారాయణను సీఈవో ఆదేశించారు.

## ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



కైకలూరు అటవీశాఖ కార్యాలయంలో అమర వీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

కైకలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అటవీ వనరులను కాపాడేందుకు విధి నిర్వహణలో అనేకమంది అధికారులు ప్రాణాలు కోల్పోయారని, వారిని స్మరించుకుంటూ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నట్లు కైకలూరు అటవీ రేంజర్ రామలింగాచార్యులు అన్నారు. కైకలూరులోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం 23 మంది అధికారులకు శ్రద్ధాంజలి ఘటించి ర్యాలీ చేశారు.గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ సంస్మరణ దినాన్ని కూడా ఇదే రోజు నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ రేంజర్ రంజిత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## కళా ఉత్సవంలో జంగంపాడు విద్యార్థుల ప్రతిభ



ఏకపాత్రాభినయంతో బహుమతి అందుకుంటున్న కర్రి కావ్యశ్రీ

కైకలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అంగలూరు డైట్ కళాశాలలో 2025 జిల్లా స్థాయిలో జరిగిన కళా ఉత్సవం కార్యక్రమంలో జంగంపాడు విద్యార్థులు ప్రతిభ చూపారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం అంగలూరు డైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జంగంపాడు గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కర్రి కావ్యశ్రీ రుద్రమదేవి ఏకపాత్రాభినయం విశేషంగా ఆకట్టుకుంది. ఆమెకు జిల్లాస్థాయిలో 3వ బహుమతి లభించింది. వికసిత్ భారత్ 2047 థీమ్‌లో ఒడుగు దీన వేసిన డ్రాయింగ్ పోటీల్లో రెండో స్థానాన్ని కైవశం చేసుకుంది. వీరిద్దరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఎంఈవో డి.రామారావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. వీరికి గైడ్ టీచర్‌గా పి.సురేష్‌కుమార్ వ్యవహరించారు.

## అక్షరాంధ్ర వలంటీర్లకు శిక్షణ

చాట్రాయి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిద్దిడానికి వలంటీర్లు పనిచెయ్యాలని ఎంఈవో-2 వీఎస్‌వీ.బ్రహ్మచారి కోరారు. చాట్రాయి వెలుగు కార్యాలయంలో గురువారం అక్షరాంధ్ర వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ వయోజనులలో కొందరు నిరక్షరాస్యులుగా ఉండడం వలన వెనుకబడి ఉన్నారన్నారు. అక్షరాస్యులైతే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో అక్షరాంధ్ర జిల్లా కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఎంఎస్ ప్రెసిడెంట్ బేబీ, అన్ని గ్రామాల వాలంటీర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరిగొస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్లవరం, చిగురు మామిడి, గ్రామాలకు చెందిన ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రేపాకగొమ్ముకు చెందిన సుమారు వంద కుటుంబాలు చెల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి, కుక్కునూరు మండలం దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలివెళ్లి రెండునెలలుగా అక్కడే ఆశ్రయం పొందుతున్నారు. మిగిలిన గ్రామాల ప్రజలు మండలంలోని మెరక ప్రాంతాల్లో ఇళ్ల అద్దెకు తీసుకుని అక్కడికి తరలివెళ్లారు. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో ఈ మండలానికి వరదముంపు పొంచి ఉంటుంది. అయితే ఈసారి గోదావరి వరద గడిచిన రెండునెలల్లో నాలుగు సార్లు లోతట్టు ప్రాంతాలు రహదారులను ముంచివేసిందే తప్ప గ్రామాల్లోకి ప్రవేశించలేదు. ప్రస్తుతం గోదావరి నదీప్రవాహం సాధారణ స్థితికి చేరుకోవడం, వర్షాల భయం తప్పిపోవడంతో వలసవెళ్లిన ప్రజలు తిరిగి గ్రామాలకు సామాన్లు తరలించుకుంటున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం అవడంతో కూలిపనులు దొరకడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. వరదభయం సెప్టెంబరులో అంతగా ఉండదనే అభిప్రాయానికి వచ్చిన మండల ప్రజలు ధైర్యంగా తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు.

# మా ఊరికి బస్సు రాదేమి!



- బస్సులు తిరగని గ్రామాలెన్నో..
- మహిళలు, విద్యార్థులకు ఇబ్బందులు
- పట్టించుకునే వారే లేరు!

ముదినేపల్లి/ఆగిరిపల్లి/కలిదిండి/చాట్రాయి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముదినేపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీలకు 16 పంచాయతీలకే బస్ సౌకర్యం ఉంది. మండలంలోని ఊటుకూరు, వణుదుర్రు, వి రావిగుంట, కాకరవాడ, కోమర్రు, ములకలపల్లి, పేరూరు, దాకరం, పెయ్యేరు, చినకామనపూడి, పెదకామనపూడి, చిగురుకోట, కోడూరు, ఈడేపల్లి, వాడవల్లి, చినపాలపర్రు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఆయా గ్రామాల ప్రజలు 2 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడివాడ- బంటుమిల్లి, ముదినేపల్లి - భీమవరం, కైకలూరు ప్రధాన రహదార్లకు నడిచివచ్చి బస్సులు ఎక్కాల్సిందే. చిగురుకోట, పెదకామనపూడి, చినకామనపూడి, కోడూరు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉండడంతో ఐదేళ్ల క్రితమే బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. ప్రధాన గ్రామాలతోపాటు, సుమారు 20 శివారు గ్రామాల ప్రజలు కూడా బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆగిరిపల్లి మండలంలోని 8 గ్రామాల్లో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూజివీడు నుంచి విజయవాడ వయా కలటూరు, తాడేపల్లి, చొప్పరమెట్ల, తాడేపల్లి, విజయవాడ బస్సు సర్వీసు, మల్లిబోయినపల్లి నుంచి విజయవాడ బస్సు సర్వీసు పదేళ్ల నుంచి నిలిపివేశారు. విద్యార్థులు, మహిళలు ఆటో లేకుంటే నడిచి వెళ్లాల్సిందే. నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజవరం గ్రామాలకు నూజివీడు డిపో నుంచి వయా, ఆగిరిపల్లి, నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజవరానికి బస్సు 20 ఏళ్ల క్రితం ఆపేశారు.

కలిదిండి మండలంలో లంక గ్రామాలైన సంతోషపురం, కొత్తూరు, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక గ్రామాలకు భీమవరం, గుడివాడ బస్సులు ఇటీవల రద్దు చేశారు. భారీ వర్షాలకు మూల్లంక నుంచి పెదలంక వరకు 7 కిలోమీటర్ల మేర రహదారి పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉండడంతో బస్సుల రాకపోకలను నిలుపుదల చేశారు. విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతుండడంతో రైతులు స్వచ్ఛందంగా మూల్లంక నుంచి పెదలంక వరకు 7 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతు చేస్తున్నారు. పోతుమర్రు, కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ గ్రామాలకు బస్సులు వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ రావడం లేదు.

చాట్రాయి మండలంలో పలు గ్రామాలకు బస్సులు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రిబంధం, గౌరీనగర్ గ్రామాలకు 7 ఏళ్ల క్రితం ఇరుకు వంతెన కారణంగా ఆర్టీసీ బస్సు సర్వీసు రద్దు చేశారు. సోమవరం, కొత్తగూడెం, యర్రావారిగూడెం గ్రామాలకు ఆటోల కారణంగా 6 ఏళ్ల క్రితం బస్సు సర్వీసులు రద్దు చేశారు. విద్యార్థుల కోసం ఉదయం సాయంత్రం బస్సు సర్వీసులున్నా ఇతర ప్రయాణికుల అవసరాలకు బస్సు సౌకర్యం లేదు. చిత్తపూరు, తుమ్మగూడెం, టి గుడిపాడు, మర్లపాలెం గ్రామాలకు కూడా విద్యార్థుల కోసం ఉదయం సాయంత్రం బస్సు నడుపుతున్నారు. స్త్రీశక్తి పథకం గ్రామీణ ప్రజలకు అందాలంటే ఈ గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు.

### బస్సు సౌకర్యం లేక ఇక్కట్లు



ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామానికి బస్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. మూడు కిలోమీటర్ల దూరంలోని మల్లపరాజుగూడెం నడిచి వెళ్లి బస్ ఎక్కాల్సి వస్తున్నది. మా గ్రామానికి బస్ రావడం ఏనాడు చూడలేదు.
- మెరకనపల్లి వెంకటేశ్వరమ్మ, ఊటుకూరు

### ఇప్పటి వరకు బస్సు రాలేదు



పేరూరు గ్రామానికి ఇప్పటి వరకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించలేదు. మారుమూల గ్రామ ప్రజలు సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ముదినేపల్లి వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంది. నాలుగు కిలోమీటర్లు నడిచి దాకరం వెళ్లి బస్ ఎక్కాల్సి వస్తుంది.
- సోమా సత్యనారాయణ, పేరూరు

### మండల కేంద్రానికి బస్సు లేదు



మండల కేంద్రంలో ఏ అవసరానికైనా ఆటోలు ఇతర వాహనాలే గతి. మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకున్నా పట్టించుకునేవారే లేరు. హాస్పిటల్‌కు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నాం. బస్సు నడిపితే విద్యార్థులకు మేలు జరుగుతుంది.
- పల్లగాని పాపారావు, చొప్పరమెట్ల

### లంక గ్రామాలకు ఇబ్బందులు



భారీ వర్షాలతో మూల్లంక - పెదలంక రహదారి ధ్వంసం కావడంతో బస్సులను రద్దు చేశారు. రైతులు రహదారి మరమ్మతులు చేస్తున్నారు. బస్సులను పునరుద్ధరించాలి. కలిదిండి, భీమవరం, గుడివాడ వెళ్లి రావడానికి ఇబ్బందులు పడుతున్నాం.
- ఎ.పద్మ, మూల్లంక, కలిదిండి

## సీసీ రోడ్ల నిర్మాణంలో కైకలూరు నియోజకవర్గం ప్రథమం



ప్రొద్దువాకలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడంలో కైకలూరు నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. ప్రొద్దువాక, దేవపూడి, వణుదుర్రు గ్రామాల్లో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌లు సింగనపల్లి రామకృష్ణ, దాసరి కాశీ అన్నపూర్ణ, చిన్నం సుగుణరావు అధ్యక్షతన జరిగిన సభల్లో కామినేని మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.33 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్రంలో అత్యధిక నిధులను సాధించిన ఘనత కైకలూరు నియోజకవర్గానికే దక్కిందన్నారు. గ్రామస్తులు ఎక్కువ శాతం వినియోగించే అంతర్గత రహదారులకు, ఎస్సీ బీసీ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎంపీడీవో రామకృష్ణ, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, గొర్లి వెంకటస్వామి, టీడీపీ, జనసేన నాయకులు దాసరి రమేష్, కేసం ప్రసాద్, బొంగు రవికుమార్, ఏఎస్.బాబు, వీరమల్లు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### శాంతిభద్రతలకు ప్రాధాన్యం

శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. దేవపూడిలో మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. కలిదిండిలో రంగా విగ్రహాన్ని అవమానించిన సంఘటన, దానగూడెంలో సంఘటనలో అల్లర్లకు పాల్పడిన వారు ఎవరైనా రక్షించే ప్రయత్నాలు జరగబోవని కామినేని తెలిపారు. కొంతమంది వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మరని కూడా స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎన్‌డీఏ నాయకులు సమష్టిగా వ్యవహరించి గ్రామస్థాయిలోనే తగాదాలను పరిష్కరించాలని సూచించారు.

### రానున్న రెండేళ్లలో బురదలేని రోడ్లు

మండవల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రానున్న రెండేళ్లల్లో గ్రామాల్లో బురద లేకుండా సీసీ రోడ్లను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఇంగిలిపాకలంక విలేజ్ క్లినిక్, ఓఎన్జీసి నిధులు రూ.10లక్షలతో ఫిల్టర్‌బెడ్, ట్యాంక్ మరమ్మతులు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ వ్యక్తికి విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వివరించారు. పెనుమాకలంక రోడ్డుకు నిధులు సమస్య ఉన్నందున రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. జడ్పీటీసీ ముంగర విజయ నిర్మల, సర్పంచ్ రత్నకుమారి తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఎంపీటీసీ వెంకటరమణ, నాయకులు బలే ఏసురాజు, సజ్జా సురేష్‌బాబు, గన్నమనేని సుధాకర్, సమయం ఏసుబాబు, ముంగర కొండలు, మల్లికార్జున, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



చిగురుకోట హైస్కూలు వద్ద నిరసన వారం పోస్టర్‌తో ఏపీటీఎఫ్ సభ్యులు



గుడిపాడులో రణభేరి పోస్టర్ ఆవిష్కరించిన యూటీఎఫ్ నాయకులు

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వారం

ముదినేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక డిమాండ్ల సాధనకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ చేపట్టిన నిరసన వారం కార్యక్రమం గురువారం ముదినేపల్లిలో ప్రారంభమైంది. జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.నారాయణదాసు, మండల అధ్యక్షుడు కృపాకర్, ప్రధాన కార్యదర్శి డి.వెంకటరత్నం ఆధ్వర్యంలో మండలంలోని ఏపీటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు నిరసన వారంలో భాగంగా తొలి రోజు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నిరసన వారం ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

### యూటీఎఫ్ రణభేరి

ముసునూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పద్మకిశోర్, రాంబాబులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ 15 నుంచి 19 వరకు నిర్వహించే రణభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను గుడిపాడు, చెక్కపల్లి జడ్పీ పాఠశాలల్లో వారు గురువారం ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న నేటికి ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచి, బోధనలకు దూరం చేస్తున్నారని, సీపీఎస్ పేరుతో పెన్షన్‌కు అనర్హులను చేశారని, వెంటనే దీనిని రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై నాలుగు రోజుల పాటు జరిగే రణభేరి కార్యాక్రమాల్లో మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ అధ్యక్షుడు పుల్లయ్య, కోశాధికారి నారాయణ, హెచ్‌ఎంలు అల్లాబక్షు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## వరిపై ఆకు నల్లి నివారణకు సూచనలు

మండవల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెరికేగూడెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి వెంకటమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు ప్రస్తుతం వరి పంటలో ఆశించిన ఆకు నల్లి నివారణపై సూచనలు ఇచ్చారు. ఏవో జి.శ్రీనివాసరావు, రవీంద్ర పాల్గొన్నారు. పెరికేగూడెం సొసైటీలో 4టన్నులు, లింగాల సొసైటీలో 13.5టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు.

## పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ రామకృష్ణ అన్నారు. ఆగిరిపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో గురువారం ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సై శుభశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆక్రమించిన పంటబోదెను పునరుద్ధరించాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగు, మురుగునీటి సౌకర్యం కోసం రైతు వారీగా ఏర్పాటు చేసుకున్న బోదెను కొంత మంది రైతులు ఆక్రమించారని వడాలికి చెందిన రైతులు ఈడే వెంకటేశ్వరరావు, దేశిన దీప్తి తెలిపారు. ఇటీవల జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, రెవెన్యూ అధికార్లు పరిశీలించి రికార్డుల్లో బోదె లేదంటున్నారని తెలిపారు.

## సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

ముసునూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో బీఏ సత్యనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. నోషనల్ ఇంక్రిమెంట్‌తోపాటు ఆరేళ్లు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు. సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకపోతే పనులు నిలిపివేస్తామని వారు హెచ్చరించారు.

## విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



అబ్బుదాసరి కిరణ్(ఫైల్)

చాట్రాయి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో పంచాయతీ వీధిలైట్లు మరమ్మతులు చేస్తున్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అబ్బుదాసరి కిరణ్(33) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇతని సహాయకులు ఓబిళ్ళనేని ప్రసాద్, అబ్బుదాసరి ఏసుబాబు గాయపడ్డారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అయిన కిరణ్ చీపురుగూడెం పంచాయతీలో వీధులైట్లు మరమ్మతు పనులు చేస్తుంటాడు. గురువారం విద్యుత్ డిపార్టుమెంట్ నుంచి ఎల్‌సీ తీసుకోకుండా వీధిలైట్లు మరమ్మతు చేస్తున్నాడు. ఓబిళ్ళనేని ప్రసాద్, అబ్బుదాసరి ఏసుబాబు నిచ్చెన పట్టుకొని సహాయంగా ఉన్నారు. కరెంట్ వైరు కిరణ్ చేతికి తగలటంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు, నిచ్చెన పట్టుకున్న ప్రసాద్, ఏసుబాబు గాయపడడంతో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చాట్రాయి ఎస్సై రామకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిరణ్ మృతితో చీపురుగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తల్లి కొన్నేళ్ల క్రితం చనిపోయింది. ఒక్కగానొక్క కొడుకు మృతితో తండ్రి రాయప్ప కన్నీటి పర్యంతమయ్యాడు. కిరణ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

కైకలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపైపోలీసులు కేసు నమోదు చేశారు. కొట్టాడ శివారు పల్లిపాలెం గ్రామానికి చెందిన కొప్పనాతి నాగూల్ మీరా(41) బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా బాగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. బుధవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చి ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని మృతి చెందాడు. గురువారం ఉదయం భార్య చూసి ఇరుగుపొరుగు వారిని సహాయంతో కిందికి దింపగా అప్పటికే మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్సై వి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కులంపేరుతో దూషించి బీరు బాటిల్స్‌తో దాడి

కలిదిండి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి బీరు బాటిల్‌తో దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. కోరుకొల్లు గ్రామానికి చెందిన బిరుదుగడ్డ అశ్వనికుమార్, అతడి స్నేహితుడు సాల్మన్ రాజ్ కోరుకొల్లు బ్రాంది షాపు వద్ద మద్యం సేవిస్తున్నారు. అక్కడే కోరుకొల్లుకు చెందిన పాశం వీరబాబు సానారుద్రవరం గ్రామానికి చెందిన పుప్పాల వెంకన్న కూడా మద్యం సేవిస్తుండగా మాటమాట పెరిగి ఘర్షణకు దిగారు. వీరబాబు, వెంకన్న బీరు బాటిల్స్‌తో అశ్విని కుమార్, సాల్మన్ రాజ్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. వారు గాయపడడంతో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్షతగాత్రులకు ఘంటసాల వెంకటలక్ష్మి పరామర్శ

కైకలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని వడ్డీ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి గురువారం పరామర్శించారు. కైకలూరు మండలం గుమ్మళ్లపాడులో గాయపడినవారిని కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని జనగామ సమీపంలో చేపలచెరువు పట్టుబడికి 20మంది కూలీలు వెళ్లారు. వారిలో కొంతమంది గుమ్మళ్లపాడు గ్రామానికి చెందినవారు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది మరికొంతమందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వం నుంచి సహకారాన్ని అందించడంతో పాటు కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి మెరుగైన వైద్యసేవలందించేకు కృషి చేస్తానని వెంకటలక్ష్మి తెలిపారు.

## వైద్య శిబిరంలో 135 మందికి కంటి పరీక్షలు

కైకలూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్న వయసులోనే అంధత్వం బారిన పడుతున్నారని, పౌష్టికాహారం తీసుకోవాలని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీలత అన్నారు. లయన్స్‌క్లబ్ మగువ ఆధ్వర్యంలో ఏలూరు శంకరనేత్రాలయ ఆసుపత్రి నిపుణులు గురువారం విద్యార్థులకు కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. మొబైల్‌ఫోన్లు అధికంగా వాడడం వలన కలిగే వ్యాధులను వైద్యులు వివరించారు. కంటి సమస్యలను ప్రారంభదశలోనే గుర్తిస్తే నివారించవచ్చని సూచించారు. వైద్య శిబిరంలో 135మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 35 మందికి కళ్లజోళ్లను అందజేశారు. అధ్యాపకులు వి.సంధ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు ఎస్.మాధవి, శంకరనేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 140, 149, 160 |
| చికెన్ విత్ స్కిన్ | 268 |
| చికెన్ స్కిన్‌లెస్ | 278 |

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

## ముసునూరు నగలార చెరువుకు సాగర్ జలాలు

ముసునూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగలార చెరువుకు సాగర్ జలాలు వస్తున్నాయి. వేంపాడు కాలువ నుంచి నీరు వచ్చే మైనర్ కాలువ పూడిపోయింది. ముసునూరు టీడీపీ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు నరసింహారావు తన సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి కాలువను బాగు చేయించడంతో గురువారం చెరువులోకి సాగర్ జలాలు చేరుతున్నాయి. చెరువులో పుష్కలంగా నీరు ఉంటే ముసునూరు, చింతలవల్లి గ్రామాల మంచినీటి బావి అడుగంటదు. పశువులకు కూడా తాగునీరు సమృద్ధిగా ఉంటుందని స్థానికులు తెలిపారు.

## మట్టితో గుండె, ఊపిరితిత్తుల నమూనా

### పెయ్యేరు పాఠశాల ఐదో తరగతి విద్యార్థినుల ప్రతిభ



పెయ్యేరు పాఠశాల విద్యార్థినులు చేసిన మట్టి గుండె, ఊపిరితిత్తులు

ముదినేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు మట్టితో మనిషి గుండె, ఊపిరితిత్తుల నమూనా తయారు చేశారు. పాఠశాలలో గురువారం ప్రదర్శనకు ఉంచగా మిగిలిన విద్యార్థులను అబ్బురపరిచాయి. ఐదో తరగతి విద్యార్థినులు యమున, నిస్సీ పుస్తకాల్లోని గుండె, ఊపిరితిత్తుల చిత్రాలను చూసి మట్టితో తయారుచేశారు. విద్యాశాఖ అమలు చేస్తున్న బోధన, అభ్యసన సామాగ్రి రూపకల్పనలో భాగంగా తయారు చేసిన ఈ మట్టి నమూనాలను ఈ నెల 13న ముదినేపల్లి హైస్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ప్రదర్శిస్తామని పాఠశాల హెచ్‌ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.